



తెగనమ్ముకుంటున్న రైతులు

కొనుగోలు కేంద్రాల్లో పుట్టి ధర రూ.19,500. బయట మార్కెట్‌లో దళారులకు అమ్ముకొంటున్న ధర రూ.16వేలు. తేడా 3500 రూపాయలు. ఈ లెక్కన 2.40 లక్షల పుట్ల ధాన్యాన్ని సుమారు రూ.84 కోట్ల నష్టానికి అమ్ముకోవడానికి రైతులు సిద్ధపడ్డారంటే వీరి కష్టం ఏమిటో అర్థం అవుతోంది. మిల్లుల వద్దకు వెళితే గోతాలు ఇవ్వరు. ఒకవేళ గోతాలు చేతికొచ్చినా లారీలు పంపరు. ఇదేమంటే జీపీఎస్ ఉన్న లారీలు తక్కువగా ఉన్నాయనే సమాధానం వస్తోంది. ఒకవేళ లారీ దొరికినా దళారులను కాదని కూలీలు రైతుల సరుకు లోడింగ్‌కు రారు. కానీ వీటితో సంబంధం లేకుండా దళారులు ఎంచక్కా రోజుకు వందల లోడ్ల ధాన్యం మిల్లులకు అమ్ముకొంటున్నారు.

ఉలవపాడు : విక్రయం కోసం ఒకేచోట ధాన్యం పోసిన చాగొల్లు రైతులు

బీపీరా!





● కష్టంలో వాటాలు

బీపీటీ పుట్టి రూ.16 వేలకు కొలుస్తున్నారు. దానిని దళారులు 17,500లకు మిల్లర్లకు అమ్ముతున్నారు. దీనివల్ల దళారీకి పుట్టి మీద 1500 లాభం. మిల్లరుకు 2,500 లాభం. ఎందుకంటే ఇదే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తే టన్నుకు 19,500 చెల్లించాలి. అదే దళారి దగ్గరయితే 17,500లకే దొరుకుతుంది. కాబట్టి మిల్లర్లు దళారులకు సహకరించినంతగా రైతులకు సహకరించడం లేదనే వాదన రైతు వర్గాల్లో వినిపిస్తోంది. రైతులు విధిలేక దళారులకు అమ్ముకునే పరిస్థితిని తీసుకొస్తున్నారనే ఆవేదన మెజారిటీ రైతుల నుంచి వ్యక్తం అవుతోంది.

జిల్లాలో ప్రధానంగా మూడు రకాల వరి సాగవుతోంది. ఒకటి ఆర్ఎన్ఆర్, రెండు కేఎన్ఎం, మూడు బీపీటీ. వీటిలో ఆర్ఎన్ఆర్, కెఎన్ఎం రకాల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ సహాయ సహకారం అవసరం లేదు. ఇవి సన్న రకాలు. ఎక్స్‌పోర్టు క్వాలిటీ. కొనుగోలు కేంద్రాల్లో వీటికి పుట్టి రూ. 19,720గా నిర్ణయించినా బహిరంగ మార్కెట్‌లో వీటికి రూ.21వేల వరకు ధర లభిస్తోంది. దీంతో రైతులు ఈ ధాన్యాన్ని నేరుగా విక్రయించుకొంటున్నారు. కొంతమంది నిల్వ చేసి ఇంకా ధర పెరిగిన తరువాత విక్రయించుకోవడానికి సిద్ధమయ్యారు.

జిల్లాలో 70 శాతం వరకు ఈ రెండు రకాలు సాగు అయ్యాయి. ఇక మూడోది బీపీటీ 30 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగయ్యింది. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 93 వేల ఎకరాల్లో సాగు అయ్యింది. ఇప్పటికి 80వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఎకరాకు మూడు పుట్లు చొప్పున 80వేల ఎకరాలకు 2.40 లక్షల పుట్ల ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉంది. ఈ మాత్రం ధాన్యం కొనడం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు. అధికారులు శ్రద్ధగా పనిచేస్తే అసాధ్యమూ కాదు. అయితే అధికారులు గిరిగీసుకున్నట్లు కూర్చోవడం, నోరు తెరిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందేమోనని ప్రజాప్రతినిధులు నోళ్లకు తాళం వేసుకొని కూర్చోవడంతో ఈ కాసింత ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేకపోతున్నారు. 26 రోజుల్లో కేవలం 15వేల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారంటే యంత్రాంగం వేగం ఏమిటో అర్థం అవుతోంది.

● గతానికి ఇప్పటికి తేడా ఏమిటో!?

గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఇదే తరహా దోపిడీ జరిగింది. అయితే అప్పట్లో వైసీపీ నాయకులే దళారుల అవతారం ఎత్తారని విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీ నాయకులు రైతు పక్షాన నిలబడి ఆందోళనలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో కూడా రైతులకు అదే కష్టం ఎదురయ్యింది. ప్రభుత్వాలు మారాయి తప్ప ధాన్యం అమ్మకాల్లో తేడాలు మాత్రం మారలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశేషమేంటే అప్పుడు రైతుల తరఫున ప్రతిపక్ష హోదాలో టీడీపీ నాయకులు నిలబడి పోరాడారు. కానీ ఇప్పుడు అధికారంలో ఉన్నా రైతుల పక్షాన నిలబడలేకపోతున్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నా నోరు మెదపడం లేదు. అసెంబ్లీకి పోయారు కాబట్టి పక్కనే ఉన్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చాంబర్‌కు వెళ్లి వచ్చారు తప్ప చేసిందేమీ లేదని, 2 లక్షల టన్నుల ధాన్యం కొనలేరు కానీ పండించిన ప్రతి గింజా కొంటామని మాటలు చెబుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పల్లెలకో, పొలాలకో, కొనుగోలు కేంద్రాల వద్దకో వెళ్లి రైతుల కష్టం ఏమిటి!? దాని పరిష్కార మార్గం ఏమిటి!? అనే కోణంలో ఎమ్మెల్యేలు స్పందించడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ పనితీరుపట్ల రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉందన్నది సత్యమని అధికార టీడీపీలోని ఓ ముఖ్యనాయకుడే వ్యాఖ్యానించడం గమనార్హం.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఈ రకం సాగుచేసిన రైతుల బెంబేలు

చేతులెత్తేసిన ప్రభుత్వ యంత్రాంగం

కొనుగోలు కేంద్రాల్లో 15 వేల టన్నులే!

లేనిపోని కొర్రీలతో బహిరంగ మార్కెట్లోనే విక్రయం

పుట్టికి రూ.3,500 నష్టపోతున్న అన్నదాత

దళారులదే రాజ్యం.. మిల్లర్ల సహకారం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పుట్టి (850 కిలోలు) ధర రూ.19,500గా నిర్ణయించారు. అయినా రైతులు దళారులకే అమ్ముకుంటున్నారు. కారణం ఆ కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి సామాన్య రైతులకు ఏమాత్రం అనుకూలంగా లేదు. కొనుగోలు కేంద్రానికి, రైస్ మిల్లుకు కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో పుట్టికి 3-4వేల రూపాయలు తగ్గినా దళారులకే అమ్ముకొంటున్నారు.

రైతుల వద్ద కొనుగోలు చేసిన దళారులు ఆ ధాన్యాన్ని పక్కరాష్ట్రాలకు అమ్ముకోవడం లేదు. తిరిగి మన రైస్ మిల్లులకే విక్రయిస్తున్నారు. అటు దళారులు, ఇటు మిల్లుల మధ్య కొనుగోలు కేంద్రాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

ఫిబ్రవరి 22వ తేదీన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సంగంలో అట్టహాసంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే, కొనుగోళ్లలో మాత్రం ఇప్పటికీ ఆ అట్టహాసం కనిపించంలేదు. దళారుల వికటాట్టహాసమే వినిపిస్తోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఇప్పటికి 26 రోజులు గడుస్తున్నా కొన్నది మాత్రం 15వేల టన్నులే. వరి కోతలు ఆరంభమైన తొలి దశలో బీపీటీ రకం టన్ను రూ.18వేల నుంచి 19వేల వరకు ధర పలికింది. 40శాతం కోతలు పూర్తయ్యేసరికి రూ.15 వేల నుంచి 16వేలకు పడిపోయాయి.

వజ్రోత్సవ సంబరం

● డీకేడబ్ల్యూలో పూర్వ విద్యార్థినుల కోలాహలం

నెల్లూరు (విద్య) : డీకే ప్రభుత్వ మహిళా కళాశాల వజ్రోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. పూర్వవిద్యార్థినుల ఆప్యాయతలు-ఆలింగనాలతో మధురాతి మధురమైన సన్నివేశాలు కళ్లను కట్టిపడేశాయి. పూర్వవిద్యార్థినులు, ప్రస్తుత విద్యార్థినులతో కళాశాల ప్రాంగణం కోలాహలంగా మారింది. నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాల 60 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా రెండురోజులు నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తరలివచ్చిన పూర్వ విద్యార్థినులు అప్యాయంగా పలకరించుకుంటూ తీపి జ్ఞాపకాలతో మమేకమయ్యారు. ఎంత ఎదిగినా ఒదిగే ఉండాలని నిరూపిస్తూ చదువులు చెప్పిన గురువులను స్మరించుకున్నారు. నాటి పాత మధురాలను గుర్తు చేసుకుంటూ చిన్నపిల్లలుగా మారిపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు ఇలా ఎంతోమంది తమ హోదాలను పక్కనపెట్టి అందరితో కలివిడిగా మనసువిప్పి మాట్లాడుకుంటూ తనివితీరా ఆనందాన్ని పంచుకున్నారు. ప్రతి ఒక్కరూతమ గురించి పరిచయం చేసుకుంటూ ప్రస్తుతం ఎవరు ఏ స్థాయిలో ఉన్నామో చెప్పుకుంటూ ఆనందాన్ని పొందారు. ఈ స్నేహం, బంధం ఇలానే కొనసాగాలంటూ ఒకేమాటగా తీర్మానం చేసుకు న్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఇక రాత్రి జరిగిన క్యాంప్ ఫైర్‌లో వయసుతో నిమిత్తం లేకుండా నేటితరం విద్యార్థినులతో కలిసి అందరూ నృత్యం చేశారు.



నృత్యం చేస్తున్న ప్రస్తుత, పూర్వ విద్యార్థినులు

- వివరాలు 8లో..

దళారులను నమ్మి మోసపోవద్దు

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

నెల్లూరు (హరనాధపురం) మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. బుధవారం శాసనసభా ప్రాంగణంలోని తన చాంబర్‌లో జిల్లా ఇన్చార్జి మంత్రి ఫరూక్ అబ్దుల్లా, జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 46శాతం వరి కోతలు పూర్తయ్యాయన్నారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి 24గంటల్లోనే డబ్బు పొందవచ్చన్నారు. 5 లక్షల గన్నీ బ్యాగ్‌లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు పర్యటించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. అలాగే రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి మిల్లు వద్ద రెవెన్యూ సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. సంగం, కోవూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా జరుగుతోందని, రైస్ మిల్లర్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడి దళారుల ప్రమేయం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.



మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (గురువారం సాయంత్రం)

సహరి : 4.57 (శుక్రవారం ఉదయం)

వైద్య రంగంలో ఏఐ వినియోగంపై పరిశోధన చేస్తా!

● 'గేట్' టాప్ ర్యాంకర్ నిఖిల్ చౌదరి

కందుకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో ఆర్టీఫిసియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంపై పరిశోధనలు చేయడమే తన లక్ష్యమని గేట్-2025లో ఏఐ విభాగంలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించిన సాదినేని నిఖిల్ చౌదరి స్పష్టం చేశారు. బుధవారం వెల్లడైన ఫలితాల అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో నిఖిల్ చౌదరి మాట్లాడుతూ తన తండ్రి సాదినేని శ్రీనివాసులు కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్ఈ విభాగంలో హెచ్‌వోడీగా విధులు నిర్వహిస్తుండటంతో ఆయన ఆకాంక్ష మేరకు ఎంటీబీఎస్ చదివినట్లు తెలిపారు. అయితే తన ఆసక్తికి అనుగుణంగా మద్రాస్ ఐఐటీ దూర విద్య ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో గ్రాడియేషన్ పూర్తి చేసి స్టాఫ్‌వేర్ రంగంలో స్థిరపడినట్లు తెలిపారు. భవిష్యత్తులో వైద్య రంగంలో ఏఐ క్రియాశీల భూమిక పోషించనున్నందున ఆదిశగా పరిశోధనలు చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గేట్‌లో మొదటి ర్యాంక్ సాధిం చడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో తన పరిశోధనలకు ఈ ర్యాంక్ మరింత ప్రోత్సాహకంగా నిలుస్తుందని అన్నారు.



తండ్రి శ్రీనివాసులుతో నిఖిల్ చౌదరి

● నిఖిల్ చౌదరి ర్యాంకు సాధించడం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్, అధ్యాపక బృందానికి గర్వకారణంగా ఉందని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అన్నారు. నిఖిల్ విజయం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నిఖిల్ తండ్రి ప్రొఫెసర్ శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

● సాదినేని నిఖిల్ చౌదరికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు భవిష్యత్తులో నిఖిల్ మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కిచ్.. కిచ్... అని అరుస్తూ ఇంటిల్లిపాదిని ఆకట్టుకుంటాయి. ఇంటా.. బయటా అవి చేసే సందడి అంతా ఇంతా కాదు.. ఇక పైరును తినేసే పురుగులను ఆరగిస్తూ రైతు నేస్తాలుగా పిలవబడే పిచ్చుకలు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు చెరువులు, బావుల ఒడ్డున చెట్లన్నీ ఆ గిజిగాడి గూళ్లతో ఎంతో అందంగా కనిపించేవి. పర్యావరణానికి మేలు చేసే ఈ పక్షిజాతి చూద్దామన్నా కనిపించడం లేదు. భవంతులు, అపార్ట్‌మెంట్ కల్చర్ పెరగడంతో వాటి గూళ్లకు స్థానం లేకుండా పోయింది. దీనికితోడు వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రేడియేషన్, శబ్ద కాలుష్యం మరో కారణమవు తోంది. ఒకప్పుడు మన జీవన విధానంలో భాగమైన ఈ పక్షిజాతిని సంరక్షించుకోకుంటే పూర్తిగా అంతరించే ప్రమాదం ఉంది. గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

జాడలేని పిచ్చుకలు

కాలగర్భంలో కలిసిపోతున్న చిరుప్రాణులు

రేడియేషన్, శబ్ద కాలుష్యమే కారణం

మేల్కొనకుంటే తీవ్ర పరిణామాలు

నేస్తమా ఏమయ్యావ్!?



నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ఉదయగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల ముందు, చెట్ల కొమ్మలపై, గుడిసెల్లో గూళ్లు కట్టుకుని కనిపించే పిచ్చుకలు నేడు కనుమరుగయ్యాయి. పెరుగుతున్న రేడియే షన్, కాలుష్యం, ఆహార కొరత, మానవుల అవగాహన రాహిత్యంతో నానాటికీ పిచ్చుక జాతి అంతరించి పోతున్నది. మారుతున్న కాలానికి అనుగుణంగా మాన వుడి జీవన విధానంలో చోటు చేసుకున్న మార్పులు పిచ్చుకలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం పిచ్చుకలకు ప్రాణసంకటంగా మారింది. మొబైల్ టవర్ల సంఖ్య విపరీతంగా పెరగడంతో వాటి నుంచి వెలువడే ఎలక్ట్రోమాగ్నెటిక్ రేడియే షన్ పిచ్చుకల దిశానిర్దేశక శక్తిని దెబ్బతీస్తోంది. ఫలితంగా అవి సరైన ఆహార వనరులను గుర్తించలేక జీవనయాత్రలో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాయి. దీనికితోడు వ్యవసాయ రంగంలో పాత వ్యవసాయ విధానాలకు స్వస్తి పలికి ఆదునాతన పద్ధతులు పాటిస్తూ పంటల్లో రసాయనిక మందుల వినియోగం అధికమైంది. ఈ మందులు పిచ్చుకలకు ఆహారంగా మారే పురుగులను నాశనం చేయడమే కాదు.. వాటి శరీరాల్లో చేరి నెమ్మదిగా ప్రాణాలు తీసే మారణాయుధాలుగా మారుతున్నాయి. అలాగే కాంక్రీట్ భవనాల సంఖ్య అధికమవడంతోపాటు వ్యవసాయ బావులు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. పిచ్చుకలకు ఆవాస ప్రాంతాలైన ఇంటి సూరు, పెరటలు, బావులు వంటి సహజమైన ప్రదేశాలు దొరకకపోవడం, అవి జీవించేందుకు తగిన వాతావరణం లేకపోవడంతో వాటికి ముప్పు ఏర్పడుతోంది. పర్యావరణంలో మార్పులు, ఉష్ణోగ్రతలు పెరుగుదల, గాలి కాలుష్యం, వర్షపాతం మార్పులు ఈ చిన్నపాటి పక్షుల మనుగడ ప్రమాదకరంగా మారింది.



పిచ్చుకలకు ప్రాణసంకటంగా మారిన ఇళ్ల మధ్య సెల్ టవర్స్

● 2010 నుంచి...

దేశంలోని నాసిక్‌కు చెందిన మహ్మద్ దిల్‌వార్ అనే ప్రకృతి ప్రేమికుడు మానవ జీవనంలో పక్షులు పాత్రను తెలిపేందుకు 2008లో నేచర్ ఫరెవర్ సొసైటీని నెలకొల్పారు. ఈ సొసైటీ సౌరాష్ట్ర లక్ష్యాలను కలిగిన అనేక ప్రపంచ సంస్థలతో కలసి మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవంగా ప్రకటించింది. 2010లో మొదటిసారి నిర్వహించిన ప్రపంచ పిచ్చుకల దినోత్సవంలో పక్షుల సంరక్షణ, వాటి ఆవశ్యకత, ప్రకృతి ప్రభావం, తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు నడుం బిగించింది. ఇప్పటికి భారత్, యూరప్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియాలతోపాటు 50 దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటు న్నాయి. దీంతో నేడు పక్షి ప్రేమికులు, పర్యావరణవేత్తలు సేవ్ ది స్పారో అంటూ నినదిస్తున్నారు.

సంరక్షణ అందరి బాధ్యత

రోజు రోజుకూ వేడుక్కుతున్న భూగోళం మానవజాతి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుం టే, ఇక పిచ్చుకల సంగతి చెప్పనక్కర్లేదు. వాతావరణంలో హాని చేస్తున్న శబ్దకాలుష్యాలను తగ్గించడం మన చేతిలో పనే. అయినదానికి, కానిదానికి రేడియేషన్ పెంచే పరిక రాల వాడకం సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలి. ఇంటి లోగిళ్లలో వాలే పిచ్చుకలను దూరం చేసుకోవడం స్వయం కృతాపరాధం. పాతతరం వారు ఇంట్లో పిచ్చుకలు గూడు కట్టుకుంటే శుభం జరుగుతుందని భావించి వాటిని మురిపంగా పెంచేవారు. వాటి ఆహారంగా ధాన్యాన్ని వేసేవారు. పంట పొల్లో నుంచి వరి కంకులను తీసుకు వచ్చి ఇళ్ల ముందు వేలాడి కట్టేవారు. ఇప్పుడు వాటిని చూడడమంటే ప్రదర్శనశాలలకు, సినిమానో, టీవీల్లో చూడాల్సిందే. మళ్లీ పాత రోజులు రావాలంటే ఎవరికి వారు తమ వంతుగా వాటిని కాపాడేందుకు కృషి చేయాలి.

ఇలా రక్షించుకుందాం!

- కిటికీలు, వెంటిలేటర్లు , డాబాలు, చెట్లు వరండాల్లో కృత్రిమ గూళ్లను ఉంచి వాటికి ఆశ్రయం కల్పిద్దాం.
- ఇంటి బయటా, బాల్కనీలో, మేడపైనా గుప్పెడు జొన్నలు, సజ్జలు, బియ్యం, గోధుమలు వంటి ధాన్యాలను వెదజల్లి వాటి ఆకలి తీరుద్దాం.
- పాఠశాల, కార్యాలయాలు, ఇళ్లు, పార్కులు, సినిమా థియేటర్లలో చిన్న నీటి తొట్టెల్లో నీళ్లు పోసి ఉంచండి. ఈ నీటి తొట్టెలను రసాయనాలు కలిపిన సబ్బులు, సర్ఫ్‌లతో శుభ్రం చేయకూడదు.
- ఇంటి ఆవరణలోనూ, ప్రభుత్వ ఆఫీసుల్లోనూ, ఇతర ప్రదేశాల్లోనూ చెట్లను పెంచడం వల్ల పిచ్చుకలను రక్షించుకోవచ్చు.
- పంటల సాగులో పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి రైతులు సహజసిద్ధమైన ఎరువుల వైపు మొగ్గు చూపాలి. సేంద్రీయ వ్యవసాయాన్ని పెంచడంవల్ల పిచ్చుకులకు ఆహార వనరులు పెంచవచ్చు.
- పిచ్చుకల్లో 35 రకాల జాతులు ఉన్నాయి. పిచ్చుకలు ఈత కూడా కొడతాయి. శత్రువుల నుంచి రక్షించుకోవడానికి అవి నీళ్లలో ఈదుతాయి.
- పిచ్చుక గంటకు దాదాపు 40 నుంచి 45 కిలోమీటర్లు వేగంతో ప్రయాణిస్తాయి. వీటి జీవిత కాలం 4 నుంచి 5 సంవత్సరాలు

నీరు, మేత సౌకర్యం కల్పించాలి



పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం వల్ల పిచ్చుకల సంఖ్య తగ్గిపోతోంది. అరకొరగా ఉన్నవాటినైనా రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. ప్రస్తుతం వాటికి నీరు, ఆహారం దొరకడం కష్టమైంది. ప్రతిఒక్కరు తమ ఇంటి మిద్దెపైన, ఇంటి పెరట్లో నీటిపాత్రలు, మేత సౌకర్యం కల్పిస్తే కొంతమేరకైనా పిచ్చుకలను రక్షించుకోవచ్చు.

- బీఎస్ కుమారరాజా, అటవీ శాఖాధికారి, ఉదయగిరి

పక్షి జాతిని కాపాడుకోవాలి



ప్రకృతిలో సమతుల్యతను కాపాడే పక్షులను ప్రతిఒక్కరు రక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. 45 ఏళ్లుగా నేను పావురాలను పెంచుతున్నా. ఒకప్పుడు పిచ్చుకల కిలకిలరావాలతో గ్రామాల్లో ప్రకృతి శోభ సంతరించుకునేది. ఇళ్లు, తోటల్లో ఆ కిలకిలరావాలను మళ్లీ వినాలంటే వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

- వెంకట్రావు, పక్షుల ప్రేమికుడు, ఉదయగిరి

సేంద్రియ ఎరువులు వాడాలి



పిచ్చుకలు రైతు సహాయకులని చెప్పుకోవాలి. నా చిన్నతనంలో వందలాది పిచ్చుకలు సాగు చేసిన పంటలపై ఆహారపు వేటలో ఉండేవి. మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం అధికం కావడంతో ప్రస్తుతం తోటల్లో పిచ్చుకలను చూద్దామన్నా కనిపించడంలేదు. పంటల సాగులో సేంద్రీయ ఎరువుల వాడి ఇలాంటి చిన్నజీవులను కాపాడాకోవాలి.

- కమలకూరి కృష్ణారెడ్డి, రైతు, గంగిరెడ్డిపల్లి

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కావలిరూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలోని ముసునూరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఖాళీ సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంధ్యారాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 40, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40, ద్వితీయ సంవత్సరంలో మిగిలి ఉన్న 3 సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7013502569ను సంప్రదించాలని తెలిపారు.

ఊళ్లకు వెళుతున్నామని ప్రచారం చేసుకోవద్దు : డీఎస్పీ

కావలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ఊర్లకు వెళ్లే వారు గుట్టుచప్పుడు కాకుండా ఉంచుకోవాలని, ముందుగా ప్రచారం చేసుకుంటే దొంగలకు సమాచారం ఇచ్చినట్లు అవుతోందని కావలి డీఎస్పీ పీ.శ్రీధర్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఊర్లకు వెళ్లే విషయం బయటకు తెలపకుండా పోలీస్‌లకు సమాచారం ఇస్తే మీ ప్రాంతంలో పోలీస్ నిఘా పెంచుతామన్నారు. ఊర్లకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు తమ ఇళ్లలో ఉంచకుండా లాకర్లలో, బంధువుల ఇళ్లలో పెట్టి వెళ్లాలన్నారు. ఇంటి బయట అందరికీ కనపడేట్లు తాళాలు వేయకుండా లోపల వేసుకోవాలన్నారు. అవకాశం ఉన్నంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగలు బెడద తగ్గటమే కాక చోరీలు జరిగితే వారిని పట్టుకోవటం సులభతరంగా ఉంటుందని చెప్పారు. ఇళ్లకు, బయట పార్కింగ్ చేసే ద్విచక్ర వాహనాలకు అలారం తాళాలు వేస్తే ఎవరైనా వాటిని టచ్ చేసినప్పుడు అలారం మోగి చుట్టుపక్కల వారు బయటకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మీ ప్రాంతంలో ఎవరైనా కొంత వ్యక్తులు తిరుగుతుంటే పోలీసలకు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

అర్హులకు అదనపు నిధులు : హౌసింగ్ పీడీ

అల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తుందని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించి క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ గృహాల నిర్మాణం చేపట్టి జూన్ మొదటివారం లోగా పూర్తి చేయాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసి వారికి నగదు జమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీడీవో రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావులతో చర్చించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ వేణుగోపాల్

న్యూస్ బాక్స్

'ఎమ్మెల్యే కాకర్లపై ఆరోపణలు మానుకోండి'

జలదంకి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అమెరికాలో స్థిరపడి తన జన్మభూమికి సేవ చేయాలనే కాంక్షతో రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యే అయ్యాడని, అలాంటి వ్యక్తికి అవినీతి మరకలు అంటించడం మానుకోవాలని వైసీపీ నాయకులకు మండలంలోని ఎన్డీఏ కూటమి నాయకులు హితవు పలికారు. జలదంకిలో బుధవారం జరిగిన విలేకరుల సమావే శంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధు రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ముడి కిషో ర్‌రెడ్డి, జనసేన నాయకుడు నిమ్మలపల్లి రామ్‌చైతన్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూ సి ఓర్వలేక ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు గంటా అశోక్, పచ్చా పెంచల య్యనాయుడు, కుట్టుబోయిన మాధవరావు, నక్కా మాధవరావు పాల్గొన్నారు.

పాఠశాలలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

బిట్రగుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రాథమిక పాఠశాల్లో హెచ్ఎం మద్దులూరి ప్రసా ద్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో సుబ్ర హ్మణ్యం ప్రారంభించారు. ఈ చలివేంద్రం ఏర్పాటుకు ముందుకువచ్చిన దాత సంజ య్ రవికొండను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయమ్మ, ఏఎంసీ వైస్‌చైర్మన్ కౌసల్య, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యాచారి, విజిత పాల్గొన్నారు.

పేదలంటే పాలకులకు చిన్నచూపు : సీపీఎం

కావలిటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : పేదలంటే పాలకులకెందుకంత చిన్నచూపని సీపీఎం నేతలు ప్రశ్నించారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ పది రోజులుగా నిర్వహించిన ప్రజాచైతన్య యాత్రలో భాగంగా పట్టణంలోని 40 వార్డులు తిరిగి ప్రజాసమస్యలు తెలుసుకున్నామన్నారు. ప్రధానంగా పేదలు నివశించే ఇందిరమ్మ కాలనీ, గిరిజన కాలనీల్లో ఇప్పటికీ కనీస మౌలిక వసతులు లేవన్నారు. గుక్కెడు నీటికి, సీసీ రోడ్లు, డ్రైన్లు, వీధి లైట్లు లేక ఇబ్బందిపడుతున్నారన్నారు. ఈ సమావేశంలో కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఐ ఆదిలక్ష్మీ ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు సుధాకర్, వెంకటేశ్వర రెడ్డి, ప్రేమ్‌కుమార్, సంతోష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల చెట్లకు నిప్పు

సీతారామపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తోటవీధిలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం ముళ్లచెట్లకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసి పడ్డాయి. గ్రామమంతా పొగతో నిండి నివాసాలకు మంటలు ఎక్కడ వ్యాపిస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉదయగిరి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి

ఉదయగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాయిపేట బీసీ కాలనీ సమీపంలో ఆటోలో నుంచి జారిపడి కోమాలోకి వెళ్లిన వేమూరి కొండయ్య (75) బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కొండయ్య మంగళవారం ఉదయగిరి నుంచి ఆటోలో స్వగ్రామమైన తిరుమలా పురం ఎస్టీ కాలనీకి వెళుతుండగా ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి కోమాలోకి వెళ్లాడని, బతకడం కష్టమని తెలపడంతో కుటుంబ సభ్యులు వెంటిలేటర్‌పై ఇంటికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడన్నారు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ప్రైవేట్ వ్యాపారుల వైపు రైతుల చూపు!

● ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై చూపని ఆసక్తి

ఉలవపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిబంధనలు పాటించి ధాన్యం విక్రయిస్తే నష్టం తప్పదని భావిస్తున్న రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. మండలంలోని ఉలవపాడు, చాగొల్లు గ్రామాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఈ-క్రాప్ నమోదై 17 శాతం తేమ ఉండి టోకెన్స్ ప్రకారం విక్రయాలు చేపడతారని వ్యవసాయ, సొసైటీ అధికారులు రైతులకు సూచించారు. బస్తాల కాటా, లోడింగ్ కూలీలు ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.17 కంటే అదనపు ఖర్చుల భారం రైతలపై పడటం, ధాన్యం ఆరబోసేందుకు పట్టల బాడుగ, ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకారం రైతులకు చెల్లింపులు ఆలస్యం వంటి వాటిని బేరీజు చేసుకొని రైతులు ప్రైవేటు వ్యక్తులకే విక్రయించగానికి మొగ్గు చూపుతున్నారు. చాగొల్లు గ్రామంలో 90 శాతం ధాన్యం విక్రయాలు జరిగిపోయాయి. ప్రైవేటు వ్యాపారులు 75 కిలోల ధాన్యం బస్తాకు మరుసటి రోజే రూ.1600 లెక్కన నగదు చెల్లిస్తున్నారని రైతులు చెప్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం విక్రయించలేక, నగదు కోసం ఎదురు చూడలేక ప్రైవేటు వ్యాపారులకు రూ.160 తేడాతో విక్రయిస్తున్నామని రైతులు అంటున్నారు.

కుల ధ్రువీకరణపై విచారణ వాయిదా

బిట్రగుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప బాడన్‌పేట చర్చి ఆవరణలో కుల ధ్రువీకరణ విషయంపై తహసీల్దారు సురేష్‌బాబు బుధవారం చేపట్టిన బహిరంగ విచారణ వాయిదా పడింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న పీట్ల ధనమ్మకు నోటీసు జారీ చేసినా విచారణకు రాలేదని, ఫిర్యాదు చేసిన గుర్రంకొండ సుమతిని, స్థానికులను విచారించి వివరాలు సేకరించినట్లు తహసీల్దారు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి నిర్ణయం మేరకు మళ్లీ విచారణ తేదీని తెలియచేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమాకుమారి, వీఆర్వో హరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత


విద్యార్థులతో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, కాలుష్య నివారణ చర్యలపై నిర్వహించిన ప్రతిభా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ బుధవారం బహుమతులను అందచేశారు. స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్రలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం పారిశుధ్యం మెరుగుకు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా ఈనెల 15వ తేదీన కావలి జిల్లా పరిషత్ బాలబాలికల పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్, కాలుష్య నివారణపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

'పది' పరీక్ష కేంద్రాల తనిఖీ

లింగసముద్రం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం, పెదపవని జడ్పీ హైస్కూళ్లలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ అధికారులైన కందుకూరు డిప్యూటీ డీఈవో పీ.నరసింహారావు, ఎంఈఓ-1 కె.రవికుమార్‌లు బుధవారం తనిఖీ చేశారు.

ఇంటూరి అవినాష్ జన్మదిన వేడుకలు

కందుకూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తనయుడు అవినాష్ పుట్టినరోజు వేడుకలు టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టెలికం బోర్డు మెంబర్ గుర్రం మాల్యాద్రి, రాజ్యలక్ష్మి దంపతులు పేదలకు అన్నాక్యాంటీన్‌లో, స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల పాఠశాలలో భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, రవిచంద్ర, వెంకటేశ్వర్లు మున్నా పాల్గొన్నారు.

● ఉలవపాడు: ఇంటూరి అవినాష్ జన్మదిన వేడుకలను టీడీపీ మండల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాయకులు ఏ.రమేష్, ఎం.మహేంద్ర, ఏ.మాధవ పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్యం, లింగ వివక్షపై అవగాహన

కావలిటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు మర్రిచెట్టు గిరిజన సంఘం కాలనీలో బుధవారం డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలు, గర్భిణులకు ఆరోగ్యం, లింగ వివక్షపై అవగాహన కల్పించారు. గర్భిణులకు ఐరన్‌పోలిక్ సిరప్‌లు అందజేశారు. కార్యక్రమంలో రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

ఉలవపాడు(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల నాయకులు బుధవారం తహసీల్దారు శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు.

శిథిలావస్థలో పక్కాగృహాలు

● నూతన గృహాలు మంజూరుకాక చల్లా యానాదుల అవస్థలు

సంగం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శిథిలమైన పక్కాగృహాల్లో వర్షం వస్తే ఎప్పుడు కూలుతాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామంటూ సంగం మండలంలోని తరుణవాయి గ్రామ గిరిజన కాలనీలోని చల్లాయానాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తరుణవాయి పంచాయతీ వాటర్ ట్యాంకు వద్ద ఉన్న గిరిజన కాలనీలో సుమారు 50 కుటుంబాల చల్లాయానాదులు నివసిస్తున్నారు. 30 ఏళ్ల కిందట ఈ కాలనీలోని కొందరు చల్లాయానాదులకు 20 పక్కాగృహాలు నిర్మించారు. అప్పట్లో ఈ కాలనీఇళ్ల గోడలకు సిమెంట్ పూతపని కూడా చేయలేదు. వీరికి సొంతంగా కాలనీ ఇళ్లు నిర్మించుకునే స్థోమత లేకపోవడంతో ఎవరో కాంట్రాక్టర్ పక్కాగృహాలు కట్టించి ఇచ్చారు. కాగా, పక్కాగృహాల నిర్మాణం నాసిరకంగా చేపట్టడంతో పాటు నిర్మించి ముప్పై ఏళ్లు కావడంతో శిథిలమై శ్లాబు పెచ్చులూడి కమ్ములు బయటపడ్డాయి. వర్షంవస్తే కూలిపోయో పరిస్థితి నెలకొంది. గత్యంతరంలేని పరిస్థితిలో శిథిల గృహాలలోనే కాలం వెళ్లదీస్తూ భయంభయంగా కాలం గడుపుతున్నారు.


గిరిజన కాలనీలో శిథిలమైన పక్కాగృహాలు

నూతన గృహాల కోసం ఎదురుచూపు

శిథిలమైన పక్కాగృహాల గిరిజనులు నూతన పక్కాగృహాల కోసం ఎదురుచూస్తున్నారు. నూతన పక్కాగృహాలు మంజూరు చేయాలని అటు అధికారులను ఇటు పాలకులను వేడుకుంటున్నా కనికరించిన నాథుడే కరువయ్యారు. దీంతో వారు నూతన పక్కాగృహాలపై ఆశలు వదులుకుని శిథిల గృహాలలోనే కాలం వెళ్లదీస్తూ వర్షాలు వచ్చినప్పుడు పాఠశాల వరండాలలో తలదాచుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీఎంఏవై కింద నూతన పక్కాగృహాలు మంజూరు చేయాలని చల్లాయానాదులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా వాల్వు గుంత

● ప్రజలు, వాహనదారుల అవస్థలు

ఉదయగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో మూతలేకుండా వాల్వు గుంత ఉండడంతో వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ సిబ్బంది వాల్వు గుంతపై ఉన్న మూత తీసి పక్కన బెట్టి గత కొన్నిరోజులుగా అలాగే వదిలేశారు. వైద్యశాలకు వచ్చే వాహనాలు, రోగులు గుంతను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాల్వు గుంతపై మూత ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.


మూత లేకుండా రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న వాల్వు గుంత

అక్రమార్కుల మధ్య విభేదాలతో

రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టు

కలువాయి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అక్రమార్కుల మధ్య నెలకొన్న విభేదాలు కారణంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం గుట్టు బట్టబయలైంది. అక్రమార్కులు ఒకొక్కరు ఒకొక్క మండలాన్ని ఎంచుకుని రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారు. ఎవరు ఎంచుకున్న మండలంలో వారి వ్యక్తులు మాత్రమే బియ్యం కొనుగోలు చేయాలి. అలా కాకుండా ఎవరైనా పక్కవారు వచ్చి కొంటే మాత్రం ఒప్పుకోరు. మంగళవారం రాత్రి కూడా అలాగే బయట మండలానికి సంబంధించిన వ్యక్తి వచ్చి ఇక్కడ బియ్యం ఆటోలో తీసుకుపోతున్నారని స్థానిక దళారులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆ ఆటోను వెంబడించి పట్టుకుని కేసు నమోదు చేశారు. కలువాయి మండలంలో సుమారు 14వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరందరికీ ప్రతి నెలా 200 టన్నులు (4000 బస్తాలు) బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇందులో పెద్దఎత్తున సుమారు 700 బస్తాలు కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం. పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రతి నెలా నిర్వహించాల్సిన సాధారణ తనిఖీలు లేకపోవడంతో ఈ అక్రమ వ్యాపారం అడ్డూ ఆపూ లేకుండా జరుగుతోందని, తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.


పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం ఆటో

లీకులతో నక్కలగండి నీరు వృథా

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలగండి రిజర్వాయర్‌లో సాగునీరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నెలల తరబడి తూము నుంచి లీకుల ద్వారా వృథా అవుతోందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రిజర్వాయర్‌లోని రొయ్యలు పట్టుకునేందుకు అనుకూలంగా క్రమేణా నీటిని తగ్గుముఖం చేసేందుకు వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సైతం విన్పిస్తున్నాయి. అదేజరిగితే భవిష్యత్తులో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఇదేమిటని ప్రశ్నిస్తే కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

రాళ్లపాడు కార్యాలయాలకు సిబ్బంది

లింగసముద్రం, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కార్యాలయాలకు సిబ్బంది రెగ్యులర్‌గా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు డీఈ ఏం వెంకటేశ్వర్లు బుధవారం చెప్పారు. ఈనెల 13వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'ప్రాజెక్టు కార్యాలయాలు ఎప్పుడు తెరుచుకుంటాయో' వార్త ప్రచురితం అయింది. అందుకు స్పందించిన ఆయన మాట్లాడుతూ ఈ రెండు కార్యాలయాల పరిధిలో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక అటెండరు, ఇద్దరు లస్కర్లు మాత్రమే ఉన్నారని చెప్పారు. ఈ ఏడాది ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నిండడంతో ఆయకట్టు పరిధిలోని 16 వేల ఎకరాలకు నీరు సరఫరా చేసేందుకు తగినంత మంది లస్కర్లు లేనందున నీటి నిర్వహణకు ఆఫీసు అటెండరును వాడుకొంటున్నట్టు చెప్పారు. ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు కందుకూరు డివిజన్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటున్నందున అప్పుడప్పుడు మాత్రమే కార్యాలయాలు మూసివేసి ఉండవచ్చన్నారు. ప్రస్తుతం నీటి నిర్వహణ చివరి దశలో ఉన్నందున ఆఫీసు సిబ్బంది ఇక నుంచి రెగ్యులర్‌గా హాజరవుతారని చెప్పారు. ఆఫీసు ఆవరణలో ఎలాంటి పిచ్చి మొక్కలు లేవని ఈ నెల 15న స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఆవరణను శుభ్రం చేసినట్టు చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేటి నుంచి ఉపాధి పనులపై విచారణ

లింగసముద్రం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన రూ.14.40 కోట్ల ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ అధికారులు గురువారం నుంచి విచారణ చేపడుతున్నట్లు స్టేట్ రిసోర్స్ పర్సన్ నీలకంఠం చెప్పారు. బుధవారం లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కడప, కర్నూలు నుంచి వచ్చిన డీఆర్పీలు, విలేజ్ సోషల్ ఆడిటర్‌లతో కలిసి ఆయన ఉపాధి హామీ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధిహామీలో చేపట్టిన పనులపై ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అదే రోజు గ్రామాలకు వెళ్లి కూలీలను విచారించడంతో పాటు పనులను కూడా తనిఖీ చేస్తారన్నారు. విచారణ పూర్తయిన తరువాత త్వరలో ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు.


ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ రికార్డులు పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ అధికారులు, సిబ్బంది

'పీఎం కిసాన్'కు రైతులు దరఖాస్తు చేసుకోవాలి

గుడ్లూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పథకానికి అసైన్‌మెంట్, డీకేటీ పట్టాలు పొందిన రైతులు గ్రామ వ్యవసాయ లేద ఉద్యాన సహాయకులను సంప్రదించి పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని నాయుడుపాలెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బందితో పాటు గ్రామ రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

● ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని బోయిల చిరువెళ్ల, కరటంపాడు సచివాలయాలను తనిఖీచేసి హాజరు పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండలంలో పీ4, వర్క్ ఫ్రమ్ హోం సర్వేలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పీ4 సర్వే పూర్తయిన తరువాత లబ్ధిదారుల జాబితాను సచివాలయంలో ప్రదర్శించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి ఈనెల 22వ తేదీ లోగా తుది జాబితాను రూపొందించాలని తెలిపారు. అదేవిధంగా గృహనిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయంపై అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసే విధంగా చైతన్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

ఉదయగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని ఎంపీడీవో అప్పాజీ, ఏపీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఫారంపాండ్ తవ్వకాలను వేగవంతం చేయాలన్నారు.

ఆస్తి వివాదం : అన్నపై తమ్ముడి దాడి

కలువాయి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం సాయంత్రం కలువాయి మండలం దాచూరులో చోటుచేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దాచూరుకు చెందిన కండ్లగుంట సుబ్బారెడ్డి, వెంకటరెడ్డిలు అన్నదమ్ములు. వీరి మధ్య చాలా కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో సాయంత్రం బస్టాండు సెంటర్‌లో ఉన్న వెంకటరెడ్డిపై అతని తమ్ముడు సుబ్బారెడ్డి కత్తితో దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరెడ్డిని బంధువులు వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు.

బీఎల్‌వోలతో సమీక్ష

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం తహసీల్దారు వై నాగరాజు మండలంలోని బూత్ లెవల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డోరు నెంబర్లు, ఫారం-8కు సంబంధించి సవరణలు పూర్తిచేయాలని, ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించాలన్నారు.

సోమశిలలో 54.930 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి19 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 54.930 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.





జ్యోతి ప్రజ్వలనతో వజ్రోత్సవాలను ప్రారంభిస్తున్న వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాళ్లు గిరి, శ్రీనివాసులు, పూర్వ విద్యార్థినులు

వేదికపై నృత్యం చేస్తున్న మంత్రి నారాయణ సతీమణి ఇందిర, ఇతర పూర్వవిద్యార్థినులు

చదువుల కోవెల 'డీకేడబ్ల్యూ'

- రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన కళాశాల
- వీఎస్‌యూ ఉపకులపతి శ్రీనివాసరావు
- అట్టహాసంగా వజ్రోత్సవం ప్రారంభం

నెల్లూరు(విద్య), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ మహిళా (డీకేడబ్ల్యూ) కళాశాల లక్షలాదిమంది విద్యార్థినులను తీర్చిదిద్దిన చదువుల కోవెల అని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. ఆ కళా శాల 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన వజ్రోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి. అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఎంతోమంది మహిళలు ఈ కళాశాలలో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సైతం అన్నీ వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందిస్తున్న ఆదర్శవంతమైన ప్రభుత్వ కళాశాలగా రాష్ట్రంలోనే గుర్తింపు పొందడం గర్వకారణమ న్నారు. కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శారద వద్ద తాను విద్యనేర్చుకు ని ఉన్నతంగా ఎదిగేందుకు పునాదులు వేసుకున్నానని చెప్పారు. నూతన విద్యావిధానం లక్ష్యాలను విద్యార్థినులకు మరింత చేరువ చేసి కళాశాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ జిల్లా చరిత్రలో డీకే కళాశాల వజ్రోత్సవాలు ఒక సువర్ణ అధ్యా యంగా నిలిచిపోయేలా నిర్వహించడం అభినందనీయమ న్నా రు. నేటితరం విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చు కుని ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ కళా శాల ప్రాభవాన్ని కాపా డుతూ ఉన్నత విద్యాబోధనలో వినూత్నమైన మార్పులతో ఒకచేత్తో డిగ్రీ పట్టా.. మరోచేత్తో ఉద్యోగావకాశం అనే నినాదం తో పనిచేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సావనీర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థినులు జయాంజలి, భాను కలిసి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ సహా యంతో రూపొందించిన దొడ్ల కౌశల్యమ్మ సందేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పూర్వ విద్యార్థినుల సంఘం సభ్యులు జ్యోతిరెడ్డి, కుసుమకుమారి, తులసి, శేషమ్మ, జయ లక్ష్మి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థినుల సమ్మేళనం జరిగింది. వజ్రోత్సవంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ఐవో శ్రీనివాసరావు, నగర మేయర్ స్రవంతి, మంత్రి నారాయణ సతీమణి పొంగూరు ఇందిర, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సునంద, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ, ప్రస్తుత విద్యార్థినులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



క్యాంప్‌ఫైర్‌లో ప్రస్తుత, పూర్వ విద్యార్థినులు

చేనేత గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 19(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం కోసం అవసరమైన చేనేత గుర్తింపు కార్డు కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి పీ వరప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొబైల్ నెంబరుకు మెసేజ్ వచ్చిన తరువాత దరఖాస్తును ప్రింటు తీసుకోవాలని తెలిపారు. విజయవాడ చేనేత సేవా కేంద్రం వారు దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తారని, అనంతరం వారి ఇళ్లను వ్యక్తిగతంగా సందర్శించి చేనేత కర్మాకులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. అర్హత కలిగిన చేనేత కార్మికులందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి చేనేత కార్డులు జారీ చేయరన్న విషయాన్ని గుర్తించాలని కోరారు.

'పది' పరీక్షలకు 28,176 మంది హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో బుధవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 174 కేంద్రాల్లో 28,485 మంది విద్యార్థుల కుగాను 28,176 మంది హాజరయ్యారు. 309 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిశీలకుడు రవీంద్రనాథ్ రెడ్డి ఆరు కేంద్రాలను, డీఈవో డాక్టర్ బాలాజీరావు ఏడు, ఫ్లైయింగ్ స్క్వాడ్ 57 కేంద్రాలు కలిపి మొత్తం 70 కేంద్రాలను పరిశీలించారు. అలాగే ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షల్లో భాగంగా బుధవారం ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. 1491 మంది అభ్యాసకులకుగాను 179 మంది గైర్హాజరుకాగా 1312 మంది హాజరయ్యారు. డీఈవో ఒక కేంద్రాన్ని, ఫ్లైయింగ్ స్క్వాడ్ 18 కేంద్రాలను పరిశీలించారు.

రేవూరులో సినీ సందడి

తణికెళ్ల భరణితో కీలక సన్నివేశాలు

అనంతసాగరం మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరులో సినీ సందడి నెలకొంది. రైతు, మధ్యతరగతి కుటుంబ కథా చిత్రం తీసేం దుకు సినీ ప్రముఖులు విచ్చేశారు. రచయిత, ప్రముఖ నటుడు తణికెళ్ల భరణితో బుధవారం కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఆ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బోయిళ్ల జనార్ధన్‌రెడ్డి నిర్మాతగా సినిమా ప్రారంభించారు. కాగా, తణికెళ్ల భరణిని చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చారు. మరో రెండు రోజుల పాటు షూటింగ్ చిత్రీకరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నెల్లూరులో తెలంగాణ మద్యం

- ఆరు సీసాల స్వాధీనం

నెల్లూరు(క్రైం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో తెలంగాణ రాష్ట్ర మద్యాన్ని బుధవారం ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. నగరంలోని పూలే బొమ్మ వద్ద ఆ మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న చిన్ని వెంకట సుదర్శన కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు లీటర్ల మ్యాన్షన్ హౌస్ ఎక్‌వో బ్రాందీ బాటిళ్లు రెండు, లీటరు మద్యం బాటిళ్లు మూడు, 750 ఎంఎల్ క్రైరాన్ మద్యం సీసా ఒకటి కలిపి మొత్తం ఆరు సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఆరోగ్యమే.. అందం.. ఆనందం. నేటి పోటీ ప్రపంచంలో మనుషులకు ఆనందం కరువైంది. మితిమీరిన కోరికలతోపాటు, భవిష్యత్ గురించి ఆలోచిస్తూ ఆనందాన్ని కోల్పోతున్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతలు నిర్వహిస్తూ, ఒత్తిడిని జయిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆనందంగా జీవించాలి. తగిన పరిమితులతో స్వచ్ఛమైన జీవితం గడపాలి. అదే మనకు అనంతమైన ఆనందాన్ని ఇస్తోంది. ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించడంపై అంతర్జాతీయ ఆనంద దినోత్సవం (మార్చి 20) సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)



ఆనందం.. ఆరోగ్యం!

ప్రతిరోజూ ఆనందంగా ఉండాలని అందరికీ ఉంటుంది. కానీ అది అందరికీ సాధ్యం కాకపోవచ్చు. అందుకే దాని కోసం ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించారు. అదే మార్చి 20. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండటానికి సరళమైన, రోజువారీ పద్ధతులను అవలంభించమని ప్రజలను ప్రోత్సహిం చడం ద్వారా సంతోషకరమైన ప్రపంచాన్ని సృష్టించడమే అంతర్జాతీయ ఆనంద దినోత్సవ లక్ష్యం. సమాజంలో స్ఫూర్తినిచ్చే వ్యక్తులు మిగతా వారిలో సానుకూలతలు పెంచడం, ప్రజలు ఆందంగా ఉండేలా చూసుకోవడం ఈ రోజు ప్రత్యేకత. అందరూ ఆనందంగా ఉండాలి. అందులో మనం ఉండాలి. అనే భావన కూడా మనలో ఆనందం నింపుతుంది.

ఆనందమే అవధిగా...

ప్రతి మనిషి జీవిత పరమార్థం ఆనందంగా జీవించడమే. ప్రతి మలుపును ఆస్వాదించడం. ఆనందంగా జీవించే వారి ఆయుర్దాయం ఎక్కువని పరిశోధనలు, వైద్యనిపుణులు చెబుతుండడం గమనార్హం. అయితే రానురాను మనిషిలో ఆనందం ఆవిరైపోతుంది. గత కాలపు చేదు జ్ఞాపకాలు, రేపటి కోసం ఉరుకులు, పరుగులు ఆనందాన్ని ఆమడ దూరంలో ఉంచుతున్నాయి. నిన్నటి గురించి ఆలోచించడం మానేసి నేటిని ఆస్వాదించడమే ఆనందానికి అసలైన మార్గమని ఆధ్యాత్మికవేత్తలు, పెద్దలు చెబుతున్నారు. గతానికి దూరంగా ఉన్నప్పుడు, భవిష్యత్తు పట్ల బెంగలేనప్పుడు, వర్తమానంలో జీవిస్తున్నప్పుడు కోపం, విషాదం కనిపించవు. సంతోషంగా జీవించగలుగుతారు. ఆనందంగా జీవించడానికి ఆస్తిపాస్తులు, మంది మార్బలం అవసరం లేదు.

ఆనంద మార్గం ఇలా..

సంపూర్ణ ఆరోగ్యమే.. ఆనందానికి సోపానం. మానసిక సంతృప్తి, ఆనందం ప్రతి మనిషికి చాలా అవ సరం. మానసిక ఆనందం శారీరక ఆరోగ్యం నుంచే కలుగుతుంది. మనసు, శరీరం ఎప్పుడు ఆరోగ్యంగా ఉంచుకోవాల్సి ఉంటుంది. ప్రతిరోజు క్రమం తప్పకుండా ధ్యానం చేస్తే మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. వ్యాయామం ఆరోగ్యాన్ని పెంపొందిస్తోంది. శరీర పటిష్టతకు, ఆరోగ్య రక్షణకు ధ్యానం, యోగాసనాలు, వ్యాయామాలు ఎంతగానో దోహదపడుతాయి. ఆనందాన్ని అనుభవించే మార్గాలు పుష్కలంగా ఉన్నాయి. దైనిందిన కార్యక్రమాల ఒత్తిడి నుంచి బయటపడడానికి ప్రతి ఒక్కరికి సరదాలు, వినోదాలు, అవసరం. విహారయాత్రలకు వెళ్లడం, కలలను ఆస్వాదిండం, ఉత్సవాల్లో పాల్గొనడం, ఆటపాటలతో గడపడం.. ఇవన్నీ ఆనందాన్ని ఇస్తాయి.

సేవ ద్వారా జీవితంలో ఆనందం




సేవా కార్యక్రమాల ద్వారా జీవితంలో ఆనందంగా ఉండవచ్చు. ఇతరులకు సహాయం చేయడం ద్వారా మనం పొందే సంతృప్తి, మానసిక ప్రశాంతత, ఆనందం చాలా గొప్పవి. విద్యాలయాలు, వైద్యశాలలు, దేవాలయాలకు స్వచ్ఛందంగా సేవ చేయడం ద్వారా మానవీయ అనుబంధాలు ఏర్పడతాయి. సేవ చేయడం అనేది కేవలం ఇతరులకు మేలు చేయడమే కాదు. అది మనలో దయ, వినయం, సహనం, వంటి మంచి లక్షణాలను పెంపొందిస్తోంది. ఈ లక్షణాలు మన జీవితాన్ని ఆనందంతో నింపుతాయి.

- కంచి పరమేశ్వరరెడ్డి, నిత్య అన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్


సాధారణ జీవన విధానం ఎంతో ఉపయుక్తం

సాధారణ జీవిత విధానం ఎంతో ఉపయుక్తం. మనకు ఉన్నదానితో సంతోషంగా ఉండటం, కృతజ్ఞతతో జీవించడం ఆనందానికి మూలం. ప్రకృతిలో గడపడం, సంగీతం వినడం, పుస్తకాలు చదవడం వంటి ఆసక్తులను కలిగి ఉంటే ఆనందాన్ని కలిగిస్తాయి. ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక వ్యాయామం ఆనందంగా జీవించడానికి చాలా అవసరం. మన జీవన లక్ష్యాలు స్పష్టంగా ఉంటే సంతృప్తి లభిస్తుంది. ప్రతి ఒక్కరు క్షమాభావం కలిగి ఉంటే మనసుకు హాయిగా ఉంటుంది.



- కలిశెట్టి రవీంద్ర, ఉపాధ్యాయుడు

ఆధ్యాత్మికతతో ఆనందం



ఆనందంగా జీవించాలంటే ఆధ్యాత్మకతను అలవర్చుకోవాలి. ఆధ్యాత్మిక సాధనల ద్వారా మనం సానుకూలంగా ఆలోచించడం, అహాన్ని తగ్గించడంలో దోహద పడతాయి. మనం ఇతరులతో దయతో వ్యవహరించడం ద్వారా అంతర్గత ఆనందాన్ని పొందుతాం. మనిషిలోని కోపాన్ని, ద్వేషాన్ని వదిలిపెట్టే శక్తి ఆధ్యాతికతతో అలవడుతుంది. ఆధ్యాత్మికత ఒక అంతర్గత ప్రయాణం. అది మనం ఆనందంగా జీవించడానికి తోడ్పడుతుంది.

- సోమవరపు యానాదిరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు

- సంపూర్ణ ఆరోగ్యమే.. సంతోషానికి సోపానం
- అందరూ బాగుండాలి.. అందులో నువ్వుండాలి
- నేడు అంతర్జాతీయ ఆనంద దినోత్సవం

ల్యాబ్‌లో రూ.45 వేల చోరీ

నెల్లూరు(క్రైం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పొగతోటలో ఓ ల్యాబ్‌లోకి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి బీరువాలోని నగదు దోచుకెళ్లాడు. పోలీసుల సమాచారం మేరకు... హౌసింగ్‌బోర్డు కాలనీలో నివసించే షాలిని పొగతోటలోని భారతి ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఆ ల్యాబ్‌లో పది మంది టెక్నీషియన్లు పనిచేస్తుండగా మంగళవారం రాత్రి షాలిని లాబ్‌కు తాళం వేసుకొని ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం మరో టెక్నీషియన్ మన్సూర్ ల్యాబ్‌కు డ్యూటీకి వచ్చాడు. షట్టర్ సగం తెరిచి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి, సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువా ర్యాక్‌లో ఉంచిన రూ.45 వేల నగదు కనిపించలేదు. ల్యాబ్‌లోని సీసీ కెమెరాలు పరిశీలించగా తెల్లవారు జామున 3.20 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ల్యాబ్‌లోకి ప్రవేశించి బీరువా పగులగొట్టి నగదు దోచుకెళ్లినట్లు తెలిసింది. వెంటనే చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ల్యాబ్‌ను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని తెడ్డుపాడు గ్రామ సమీపంలోని 565 జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెడ్డుపాడు ఎస్సీ కాలనీకి చెందిన మేలింగి సురేష్(35) పని నిమిత్తం నర్రవాడకు వచ్చి తిరిగి స్వగ్రామమైన తెడ్డుపాడు ఎస్సీ కాలనీకి బైక్‌పై వెళుతుండగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుకవైపు ఢీకొని తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మీ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



సురేష్(ఫైల్)

రెండు ఎక్స్‌కవేటర్ల సీజ్

సైదాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దేవరతిప్ప వద్ద అక్రమంగా తెల్లరాయి తవ్వుతున్న రెండు ఎక్స్‌కవేటర్‌లను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. వారి కథనం మేరకు ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయి తవ్వుతు న్నారని సమాచారం అందడంతో తెల్లవారు జామున తనిఖీలు నిర్వహించామన్నారు. రెండు ఎక్స్‌కవేటర్లను సీజ్‌చేసి తురకా రాము మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాంతికుమార్ తెలిపారు.



ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసిన పోలీస్‌లు



కలిగిరిలో పొగాకును కొనుగోలు చేస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

కలిగిరి/మర్రిపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : 2025-26 సీజన్‌కు సంబంధించి కలిగిరి, మర్రిపాడు మండలం డీసీపల్లి వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు గరిష్ఠ ధర రూ.280గా నమోదయ్యింది. ముందుగా బోర్డు అధికారులు, రైతులు పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. కలిగిరిలో వేలం నిర్వహణాధికారి మహేష్ కుమార్ ఈ ప్రక్రియ ప్రారంభించగా, రైతులు 36 బేళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. మొత్తం 36 బేళ్లను వివిధ కంపెనీల ప్రతినిదులు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ కుమార్, రైతులు పాల్గొన్నారు. ఇక మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రాంలో 18బేళ్లను ఏడు కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేశారు. వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్, రైతుసంఘం నాయకులు నరసప నాయుడు, జానార్దన నాయుడు, మూలి వెంగయ్య పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ రుణాలతో ఆర్థిక పరిపుష్టి

- జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఎంఈ రుణాలతో అన్ని రంగాల ఆర్థిక పరిపుష్టి సాధ్యమని, ఈ రుణాల మంజూ రులో ప్రైవేటు బ్యాంకర్లు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ప్రైవేటు బ్యాంకర్లు కూడా ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు పూర్తి సహాయ సహకారాలు అందించి జిల్లా అభి వృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నందున రైస్ మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీలు త్వరగా మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. ఈ సమావే శంలో లీడ్ డిస్ట్రిక్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్, నాబార్డు డీడీఎం బాబు, ఆర్‌బీఐ మేనేజర్ రాజేష్, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ జేడీలు రమేష్‌నాయక్, నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్వర సంబరం ఆరంభం

- వీనుల విందుగా త్యాగరాజ స్మరణోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పురమందిరంలో 60వ త్యాగరాజ స్మరణోత్సవాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో ఈ సంగీత పండుగ ఈనెల 26వతేదీ వరకు జరగనుంది. తొలిరోజు ఉదయం వేదాయపాళెంలోని త్యాగరాజ మందిరం నుంచి సీతాలక్ష్మణ హనుమ సమేత శ్రీరామచంద్రస్వామి, త్యాగరాజ స్వామి పటాలను ఊరేగింపు తీసుకొచ్చి స్మరణోత్సవ వేదికపై కొలువుదీర్చారు. అలాగే, రంగనాయకులపేట వేదాంత దేశికర్ ఆలయం నుంచి 3డీ అట్టలతో తయారు చేసిన త్యాగరాజస్వామి విగ్రహాన్ని మేళతాళాలు, భజనలతో ఊరేగింపుగా టౌనుహాలుకు చేర్చారు. అనంతరం నారాయణ రావు భాగవతార్, వాణీ భాగవతార్ హరికథా గానం చేశారు. సాయంత్రం జొన్నవాడ సురేష్, బుధవరపు రమణయ్య శాక్సాఫోన్ కచేరీ వీనులవిందు చేసింది. సంగీత విద్వాంసులు జే బాలార్క, డీవీ సురేష్‌రావు, ఏ రమాదేవి, సత్యవాణి, వారి శిష్యబృందం త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలు ఆలపించారు. గురుకృపా కళా నిలయం విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన చాగంటి రమ్య కిరణ్మయి బృందం ప్రదర్శన సంగీత ప్రియులను రంజింపజేసింది. కళాకారులను ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్పీ శైలజ సత్కరించారు. ఈ కార్యక్రమాలను సభ కార్యదర్శి వై నాగదేవీప్రసాద్, సభ్యులు పర్యవేక్షించారు. కాగా, ఈ స్మరణోత్సవాల కోసం గాయని ఎస్పీ శైలజ జోలె పట్టడం విశేషం.



స్మరణోత్సవాల కోసం జోలెపట్టిన ఎస్పీ శైలజ

ప్రతి ఇంటికి ఇంకుడుగుంత తప్పనిసరి

- డ్వామా పీడీ గంగాభవాని

కావలిరూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని డ్వామా పీడీ గంగాభవాని పేర్కొన్నారు. కావలి మండలం చెంచుగానిపాలెంను బుధవారం ఆమె సందర్శించి ఇంకుడుగుంతల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివాస్‌లో భాగంగా నూరు శాతం ఇంకుడు గుంతలు ఉన్న మోడల్ గ్రామంగా చెంచుగానిపాలెం గ్రామాన్ని జిల్లా కలెక్టరు ఆనంద్ ఎంపిక చేశారన్నారు. ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఉండాలని, వారంలోపు నిర్మాణంలో ఉన్న అన్ని ఇంకుడుగుంతల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలు డ్రైనేజీ లేక మురికి కూపంలా మారుతున్నాయని, తద్వారా నీటి నిల్వలతో దోమలకు నిలయంగా మారుతున్నాయన్నారు. గ్రామంలో 401 గృహాలు ఉండగా గతంలో ప్రభుత్వం 180 ఇళ్లకు ఇంకుడు గుంతలు నిర్మించి ఉందని, 35 గృహాల వారు స్వయంగా ఇంకుడు గుంతలు తవ్వుకున్నార న్నారు. మిగిలిన 186 గృహాలకు ప్రభుత్వం నిర్మించి ఇవ్వడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మృదుల, ఎంపీడీవో శ్రీదేవి, జడ్పీటీసీ రాఘవులు, కార్యదర్శి విజయ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	208
స్కిన్‌లెస్	228

కోడిగుడ్ల ధర (100): 425

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8517
వెండి కిలో ధర	రూ. 102,600
వెండి ఒక గ్రాము	రూ.105.60

విద్యుత్ బిల్లుల భారాన్ని ప్రభుత్వమే భరించాలి : సీపీఎం

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విపరీతంగా పెంచేసిందంటూ సీపీఎం ఆధ్వర్యంలో మిలీనియం సబ్‌స్టేషన్ విద్యుత్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోనే విద్యుత్ బిల్లుల అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆ అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు ప్రసాద్, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

భూ పట్టాలు రద్దు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడు గ్రామం సర్వే నెంబరు 3లో తహసీల్దారు ఇస్కా భక్తవత్సలరెడ్డి మెట్టా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులకు చట్ట విరుద్ధంగా ఇచ్చిన 502 ఎకరాల భూమి పట్టాలను రద్దు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాచమల్లి రమేష్, ఆమంచర్ల గ్రామ రైతులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ భూ కుంభకోణంపై తాము గతంలో కలెక్టర్లు శ్రీకాంత్, జానకిలకు ఫిర్యాదు చేయగా వారు సదరు పట్టాలను రద్దు చేయమని సీసీఎల్‌ఏలో కేసు ఫైల్ చేశారని తెలిపారు. వైసీపీ నాయకులు చేసిన ఈ కుంభకోణంపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పరీక్ష కేంద్రాల వద్ద గుమికూడొద్దు : సీఐ

నెల్లూరు రూరల్, మార్చి 19, (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాల వద్ద ఎవరూ గుమికూడొద్దని, అలాచేస్తే అదుపులోకి తీసుకుంటామని నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు హెచ్చరించారు. బుధవారం రూరల్లోని పరీక్ష కేంద్రాల వద్ద ఆయన గస్తీ నిర్వహించారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కేంద్రాలకు సమీపంలో జనాలు గుంపులుగా ఉండకూడదని స్పష్టం చేశారు.

సౌత్ మోపూరులో 'ఫోర్ పిల్లర్స్' షూటింగ్

నెల్లూరు రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో బుధవారం ఫోర్ పిల్లర్స్ చిత్రం షూటింగ్ జరిగింది. రణధీర్ కథా నాయకుడిగా, అనక నాయికగా తెరకెక్కనున్న ఈ చిత్రం తొలిరోజు ముహూర్తపు షాట్‌ను గ్రామంలోని మోపూరమ్మ దేవస్థానం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి కెమెరా స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. ఈ సినిమాకు ప్రవీణ్ బండా దర్శకత్వం వహిస్తున్నారు. 1980ల్లో గ్రామీణ వాతావరణం నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి

కోవూరు, మార్చి19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రీజియన్ పరిధిలోని బస్సులు, డిపోల్లో ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తామని ఆర్టీసీ రీజియన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక జోనల్ రీట్రేడింగ్ వర్క్‌షాపును బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొత్త బస్సుల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను జోనల్ వర్క్‌షాపులో కార్మికులు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. వర్క్‌షాపునకు నిరంతర నీటివసతిని అందించమని పడుగుపాడు పంచాయతీని కోరనున్నామని ఆయన పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్యం కోసం త్వరలోనే వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ప్రైవేటు పాఠశాలకు తాళం

కోవూరు, మార్చి19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ ప్రైవేటు పాఠశాలకు భవన యజమాని బుధవారం తాళం వేశారు. కొద్దికాలంగా పాఠశాల యాజమాన్యం అద్దె చెల్లించకపోవడంతో యజమాని వినీత్‌రెడ్డి భవనానికి తాళం వేశారు. భవనానికి ప్రభుత్వం జీఎస్టీ విధించడంతో చాలా కాలం నుంచి యజమాని అద్దెను జీఎస్టీతో సహా చెల్లించమని కోరుతున్నారు. అయినా యాజమాన్యం పట్టించుకోక పోవడంతో తాళం వేశామని ఆయన పేర్కొన్నారు. ఘటనాస్థలానికి ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ చేరుకుని యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న తరుణంలో పాఠశాలకు తాళం వేయడంపై విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

పొదలకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసారెడ్డికాలనీలో ఉన్న లక్ష్మీ మహిళా మండలి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించారు. వృద్ధులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రిషిత, ఆరోగ్య సహాయకులు ఎం.రాధాకుమారి, సాని శివప్రసాద్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ టీ.సుమాంజలి, ఏఎన్ఎం కృష్ణమ్మ, ఆశా కార్యకర్తలు ఉష, సీత, లక్ష్మి, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలపై అవగాహన

సైదాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురిమెర్ల, గ్రిద్దలూరు గ్రామాల్లో బుధవారం ఏవో హైమావతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో హైమావతి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వాడితే రూ.లక్ష వరకు జరిమానా

● నగర కమిషనర్ సూర్యతేజ హెచ్చరిక

నెల్లూరు(సిటీ), మార్చి19, (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఎక్కడైనా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగిస్తే భారీగా జరిమానా వేస్తామని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య విభాగం అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువులను నగరంలో పూర్తి నిషేధించినట్లు తెలిపారు. ఈ క్రమంలో శుభకార్యాలు, పబ్లిక్ మీటింగ్‌లు, వివిధ రకాల ఫంక్షన్లు, హోటళ్లు, వైన్‌షాపులు, బార్లు, రెస్టారెంట్లు వంటి వ్యాపార సంస్థల కార్యకలాపాలపై కూడా నిఘా ఉంచామని తెలిపారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడినట్లు తేలితే రూ.1లక్ష వరకు జరిమానా విధిస్తామని



పారిశుధ్య సిబ్బంది సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్

వివరించారు. దేశ వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో జరుగుతున్న స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో ప్రజలందరు పాల్గొని వారి అభిప్రాయాలు తెలియచేయాలని కోరారు. దీనిపై డివిజన్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ నందన్, ఎంహెచ్‌వో చైతన్య, అమృత్ పథకం పీడీ మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఘనత చంద్రబాబుదే

నెల్లూరు (వైద్యం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ వెల్లడించారు. బుధవారం నగరంలోని డాక్టర్ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. వర్గీకరణ వల్ల ఎస్సీలకు 25వేల ఉద్యోగాలు దక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు డేగ రవి రాఘవేంద్ర, కుడుముల సుబ్బారావు, పలిగెళ్ల పెంచలయ్య, నాగేశ్వరరావు, ఇజ్రాయెల్, చల్లా భాస్కర్, శ్యాము తదిత రులు పాల్గొన్నారు



చంద్రబాబు ప్లెక్సీకి పాలభిషేకం చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

చంద్రబాబుకు రుణపడి ఉంటాం : బెల్లంకొండ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు పూనుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మాదిగలందరం రుణపడి ఉంటామని ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ బెల్లంకొండ గోపీ మాదిగ చెప్పారు. బుధవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలోనూ ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు కోలగట్ల రమేష్ మాదిగ, మధు మాదిగ, స్వర్ణక్క, పెంచలయ్య మాదిగ, సుధాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రపంచ కవితా దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చిన్ని నారాయణ రావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్స వం నిర్వహిస్తున్నట్లు పెరసం అధ్యక్షురాలు జీ సుభద్రాదేవి, కవి చిన్ని నారాయణరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేత్రపర్వం.. రంగడి పుష్పయాగం

● నేడు శ్రీవారి తెప్పోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం పుష్పయాగం, దవనోత్సవం భక్తులకు కనువిందు చేశాయి. కాగా, ఉత్సవాల్లో చివరిదిగా గురువారం సాయంత్రం శ్రీవారి తెప్పోత్సవం జరగనుంది. దీనికి సంబంధించి బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. తెప్పోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. రంగనాథుని సన్నిధి నుంచి సాలుచింతల వరకు తెప్పోత్సవం జరుగు తుందన్నారు. మంత్రులు పీ నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో స్వామి వారికి సొంతంగా తెప్పను తయారు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నగర డీఎస్పీ సింధుప్రియ, ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, అధి కారులు పాల్గొన్నారు.





ఏర్పాట్లు పరిశీలిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి, డీఎస్పీ సింధుప్రియ

వినియోగదారుల కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలేంటి? : వేమిరెడ్డి



నెల్లూరు (హరనాథపురం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వినియోగదారులకు సంబంధించిన కేసుల పరిష్కారానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఏమిటని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం లోక్‌సభలో ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ సమాధానం ఇచ్చారు. గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎస్‌సీడీఆర్‌సీ)లో 2,260 కేసులు నమోదయ్యాయని, వాటిలో 1686 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. వినియోగదారుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చే ఉద్దేశంతో రక్షణ చట్టం -2019 రూపొందించినట్లు వివరించారు. వినియోగదారుల కమిషన్లలో ఉన్న ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు.

ఉగాది వేడుకలకు తరలిరండి

● డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం



నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాబోవు ఉగాది పండుగను నగరంలోని గాంధీబొమ్మ శివాజీసెంటర్ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్నామని, అందరూ తరలిరావాలని ఉగాది ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. బుధవారం టీవీఎస్ కల్యాణ సదన్‌లో ఉగాది వేడుకల సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. వేడుకల గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉగాది వేడుకలను వరసిద్ధి వినాయకస్వామి ఆలయ కమిటీ, టీవీఎస్ కల్యాణ్ సదన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఉదయం 7 గంటలకు గోపూజతో కార్యక్రమాలు మొదలవుతాయని, సాయంత్రం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామి అనుగ్రహ సంభాషణం ఉంటుందని తెలిపారు. బీజేపీ నాయకుడు సురేంద్రరెడ్డి ఉగాది ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారులుగా నీవీ సుబ్రహ్మణ్యం, పిట్టు సత్యనాగేశ్వరరావు, అధ్యక్షుడిగా బీఎస్ రంగరాజన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దేశిబొట్ల ఫణిరత్నం, ప్రధాన కార్యదర్శులుగా హర్షవర్ధన్, జగన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరావు, నాగలక్ష్మి, ఉమాదేవి, జయలక్ష్మి, నీలి రాఘవ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షల్లో పేరుకున్న అద్దె బకాయిలు

● పదేళ్లుగా వేలానికి నోచని బెగోరె దుకాణాల సముదాయం
● ఆన్‌లైన్ చేయని మున్సిపల్ షాపులు
● వార్డు కౌన్సిలర్ మొరపెట్టుకున్నా స్పందన నిల్

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి(బెగోరె) దుకాణాల సముదాయం నుంచి నగర పంచాయతీకి రూ.ఐదు లక్షలు అద్దె బకాయిలు వసూలు కావాల్సిఉంది. వీటి వసూళ్లలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నగర పంచాయతీ ఏర్పాటై నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో షాపింగ్ కాంపెక్సులు, వ్యాపార దుకాణాల నుంచి వసూల్‌రాజాల దందాలు పెరిగిపోయాయి.దీంతో మున్సిపాలిటీకి ఆదాయం తగ్గింది. ఇళ్ల పన్నుల బాకాయిలు కూడా రూ.కోటిపైగానే వసూలు కావాల్సిఉంది.

● **వేలం నిర్వహణ ఏదీ ?**

మున్సిపాలిటీలోని షాపింగ్ కాంప్లెక్సులు, ఇతర దుకాణాల వేలంకు గతంలోనే అధికారులు తిలోదకాలిచ్చారు. నిబంధనల మేరకు రెండు, మూడేళ్లకు ఒకసారి ఐదు నుంచి 10శాతం మేర అద్దె పెంపుతో వేలం నిర్వహించాల్సి ఉంది. పంచాయతీగా ఉన్నప్పుడు చివరిసారిగా ఐదేళ్ల క్రితం వేలం నిర్వహించారు. నగర పంచాయతీగా ఏర్పాటయ్యాక వేలం ఊసేలేదు. కొద్దిగా అద్దెలు పెంచి అధికారులు చేతులు దులుపుకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంపై 16వవార్డు కౌన్సిలర్ బీటగుంట ప్రమీలమ్మ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందనలేదు. ఇప్పటికే కొంతమంది అద్దెలు చెల్లించకుండానే దుకాణాలు మూసేశారు. ఇంకొందరు ఖాళీ చేసి వెళ్లిపోయినా అధికారులు పట్టించుకోలేదు. అద్దెల విషయంపై కమిషనర్ బాలకృష్ణను వివరణ కోరగా అందరికీ నోటీసులు జారీ చేశామని తెలిపారు. అన్నీ దుకాణాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



బుచ్చిలోని బెజవాడ గోపాల్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్

కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తోటపల్లిగూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కుట్టు మిషన్ శిక్షణ కోసం మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కే. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీ, కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా తెల్ల రేషన్‌కార్డు కలిగి, 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు శిక్షణ కోసం ఏపీ ఓబీఎంఎంఎస్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బీసీలు 36, కాపులు 6, ఈడబ్ల్యూఎస్ 74 మంది కలిపి మొత్తం 116 మందికి మాత్రమే శిక్షణకు అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు ఆరుగురి గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఆరుగురు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. 101 మంది విద్యార్థులకుగాను 95 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

కోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు

కోవూరు, మార్చి19(ఆంధ్రజ్యోతి): విడవలూరు మండలం వరిణి గ్రామ భూముల్లో ఉన్న అక్రమణలను తొలగించాలని హైకోర్టు ఆదేశించినా, జిల్లా, మండల అధికారులు పట్టించుకోవటం లేదని అల్లూరుకి చెందిన ఆక్వా రైతు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది శివమోహన్‌రెడ్డి తెలిపారు. కోవూరులో బుధవారం అయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పరిధిలోని సర్వేనెంబర్లు 1773, 1774, 1776, 1777, 1779, 1780, 1781, 910 -1లలో 110 ఎకరాలు భూమి ఉందన్నారు. ఈ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దొంగ పత్రాలను సృష్టించి ఆక్రమించుకున్నాడని తెలిపారు. నెల క్రితం అక్రమిత భూముల్లో ఉన్న విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే కోర్టు ఆదేశాలను అధికారులు బుట్టదాఖలు చేశారని తెలిపారు. జిల్లాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని ఆయన కోరారు.

'నిందలు మోపడం సరికాదు'

విడవలూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊటుకూరులో టీడీపీ హయాంలో ఎల్‌పీఎస్ భూములను పేదలకు పంచలేదని, కొందరు నిందలు మోపటం సరికాదని తహసీల్దారు చంద్రశేఖర్ తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం అయన విలేకరులతో మాట్లాడారు. 2018లో గ్రామానికి చెందిన 90 మంది నిరుపేదలకు 90.86 ఎకరాల భూమిని ఎల్‌పీఎస్ పథకం కింద ఇచ్చామన్నారు. ఈ విషయం తెలియకుండా నిందలు మోపటం సరికాదన్నారు. భూ పంపిణీలో ఎలాంటి అక్రమాలు, అవినీతి జరగలేదన్నారు.

సచివాలయాల తనిఖీ

సైదాపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపూడి, కొమ్మిపాడు గ్రామ సచివాలయాలను ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న సర్వేలపై అవగాహన కల్పించి రికార్డులు పరిశీలించినట్లు తెలిపారు.

చెన్నై మెట్రో వాటర్ బృందం కండలేరు సందర్శన

రాపూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కండలేరు రిజర్వాయర్‌ను చెన్నై మెట్రో వాటర్ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఈవో కట్ట తిరుమలయ్య, టిజిపి ఎస్ఈ ఎన్ రాధాకృష్ణారెడ్డి, ఈఈ డివిజన్ 2, ఎం విజయరాణి రెడ్డి, డిప్యూటీ ఈఈ సిబ్బంది పాల్గొన్నారు.



ఇఫ్తారు విందులో ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరురూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 33వ డివిజన్ కుబా మసీదులో బుధవారం జరిగిన రంజాన్ ఇఫ్తార్ విందులో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా మతపెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు.



సునీతా విలియమ్స్ బృందానికి కళాభివందనాలు

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : అంతరిక్షం నుంచి విజయవంతంగా భూమి మీదకు వచ్చిన సునీతా విలియమ్స్ బృందానికి సూక్ష్మ శిల్ప కళాకారుడు గంధవళ్ల ఉమా శంకర్ కళాభివందనం తెలిపారు. మర్రి ఆకుపై సునీతా చిత్రాన్ని కత్తిరించి హర్షం వ్యక్తం చేశారు.

మహిళా పంచాయతీపై పరిశోధన

మనుబోలు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువపల్లి పంచాయతీ సర్పంచు, వార్డు సభ్యులంతా మహిళలే. దీంతో ఆ పంచాయతీపై కేంద్ర జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ దృష్టి పెట్టింది. బుధవారం సంస్థకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ ఎస్.కే. సత్యప్రభ, విజయవాడ పంచాయతీరాజ్ శాఖ ఏపీడీ ప్రసాద్ కట్టువపల్లికి వచ్చారు. మహిళా పాలకవర్గంతో సమావేశం ఏర్పాటుచేసి పరిపాలన విధానం, తీసుకునే నిర్ణయాలు, ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు పొదుపు మహిళల సంఘాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. మరికొన్ని అంశాలపై సర్వేచేశారు. అనంతరం సర్పంచు ఎస్. భారతిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఈవోపీఆర్డీ నారాయణ, కార్యదర్శి దీపిక తదితరులు పాల్గొన్నారు.




పంచాయతీ పాలకవర్గంతో ఎన్ఐఆర్డీ అధికారిణి సత్యప్రభ

విద్యుత్ వినియోగదారులకు రాయితీ

తోటపల్లిగూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వలంటరీ స్కీమ్ ద్వారా విద్యుత్ వినియోగదారులకు 50 శాతం రాయితీ కల్పిస్తామని విద్యుత్ శాఖ ఏడీ రాము పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లిగూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉన్న సర్వీసులపై అదనపుభారం చెల్లించేందుకు వినియోగదారులకు ప్రభుత్వం ఈనెలాఖరు వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. విద్యుత్ బిల్లులు కూడా సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం ప్రవేశ పెట్టిన సోలార్ గ్రీన్ ఎనర్జీ పథకం ద్వారా కిలోవాట్ విద్యుత్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్స్‌కు రూ.60వేలు ఖర్చవుతుందని వివరించారు. ఇందులో 50 శాతం సబ్సిడీ ఉంటుందని, బ్యాంకుల ద్వారా రుణ సహాయం అందిస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పూర్తి రాయితీ ఉంటుందన్నారు. ఈ విషయమై వినియోగదారులకు సిబ్బంది అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఈ బీ.సుకుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తి సునీతా విలియమ్స్

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి19(ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో పరిశోధనల కోసం వెళ్లిన సునీతా విలియమ్స్ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలాం పురస్కార గ్రహీత గండికోట సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సునీతా విలియమ్స్ జీవిత చరిత్రను ఆయన వివరించారు.సురక్షితంగా భూమికి దిగిన వచ్చిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మందుబాబులకు సామాజిక సేవా శిక్ష



ఆ ముగ్గురిని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌బాబుకు అప్పగిస్తున్న సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ముగ్గురికి సూళ్లూరుపేట కోర్టు జరిమానాతో పాటు సామాజిక సేవ శిక్ష విధించింది. సూళ్లూరుపేట పట్టణ పరిసరాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. సూళ్లూరుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 2వ తరగతి అదనపు న్యాయమూర్తి సుబ్బారావు ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి కేసును విచారించి మందుబాబులు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున జరిమానా విధించారు. అలాగే సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో మూడు గంటల పాటు సామాజిక సేవ చేయాలని ఆదేశించారు. దీంతో పోలీసులు మందుబాబులను ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌బాబుకు అప్పగించారు.

ఇసుక రవాణా అడ్డుకుంటావా?

- ఓ రైతు ఇంటిపైకి దాడికెళ్లిన అక్రమార్కులు



అక్రమార్కులు వదిలేసి వెళ్లిన ట్రాక్టరు

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చేసేది ఇసుక అక్రమ రవాణా. దీనిని అడ్డుకున్నారనే అక్కసుతో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ రైతు ఇంటిపైకెళ్లి దాడికి యత్నించారు. ఈ ఘటన సూళ్లూరుపేట మండలం మంగళంపాడులో చోటుచేసుకొంది. స్థానికుల సమాచారం మేరకు.. కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు అక్రమార్కులు మంగళంపాడు పొలాల్లో దారి ఏర్పాటు చేసుకున్నారు. రాత్రివేళ నది నుంచి ఇసుక తీసుకెళుతున్నారు. రెండు రోజుల కిందట కొందరు రైతులు 100కి కాల్‌చేసి ఫిర్యాదు చేశారు. ఆ రైతులపై పగబట్టిన అక్రమార్కులు బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కొమరం నారాయణస్వామి ఇంటి పైకి నాలుగు వాహనాల్లో మనుషులను తీసుకెళ్లి రాళ్లు రువ్వారు. దాడికి యత్నించారు. ఇంతలో ఇరుగుపొరుగువారు అక్కడకు చేరుకోవడంతో రెండు ట్రాక్టర్లను వదిలేసి పరారయ్యారు. పోలీసులు గ్రామానికి చేరుకుని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై సీఐ మురళీకృష్ణను వివరణ కోరగా.. పొలాల్లో ఇసుకను తరలించేందుకు దారివేయడంపై అడిగినందుకు రైతు నారాయణస్వామి ఇంటి పైకి దాడికి వచ్చారని బాధితులు చెప్పారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



విచారణకు హాజరైన టీటీడీ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విజిలెన్స్ అధికారులు



విచారణ అనంతరం బయటకు వస్తున్న కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి

భక్తులను పద్మావతి పార్కులోకి ఎందుకు పంపారు?

- తొక్కిసలాట సమయంలో మీరు ఎక్కడ ఉన్నారు?
- పూర్వ జేఈవో గౌతమిపై కమిషన్ ప్రశ్నల వర్షం
- న్యాయవాదులతో విచారణకు వచ్చిన పోలీసులు
- దాదాపు వంద మంది విచారణకు హాజరు



విచారణకు హాజరైన టీటీడీ పూర్వ జేఈవో గౌతమి.. నాటి ఎస్పీ సుబ్బరాయుడు, పూర్వ సీవీఎస్వో శ్రీధర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై టీటీడీ పూర్వ జేఈవో గౌతమిని ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి సుదీర్ఘంగా విచారించారు. బుధవారం ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ విచారణ సాగింది. 'వైకుంఠ ఏకాదశికి తిరుమలకు లక్షల్లో భక్తులు వస్తారు. టోకెన్ల కోసం పెద్దసంఖ్యలో వస్తారని తెలుసుకదా? మీరు తీసుకున్న యాక్షన్ ప్లాన్ ఏమిటి? టికెట్ల కేటాయింపునకు ప్రభుత్వ హైస్కూల్ కేటాయిస్తే.. భక్తులను పద్మావతి పార్కులోకి ఎందుకు పంపించారు? తొక్కిసలాట సమయంలో మీరెక్కడ ఉన్నారు? ఘటనా స్థలానికి ఎందుకు రాలేదు? పార్కు తాళాలు ఎవరు వేశారు?' ఇలా వివిధ అంశాలపై జస్టిస్ సత్యనారాయణమూర్తి ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. 'పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని తిరుమల, తిరుపతిలోని పరిపాలన భవనంలో భక్తులకు టోకెన్ల కేటాయింపు విషయంపై పలుమార్లు సమీక్ష నిర్వహించాం. యాక్షన్ ప్లాన్‌నూ సిద్ధం చేశాం. బైరాగిపట్టెడ పార్కు నా పరిధిలోకి రాదు. సంఘటన జరిగినప్పుడు నేను జీవకోనలోని టోకెన్ల కేంద్రంలో ఉన్నాను. ఘటన జరిగిన వెంటనే స్విమ్స్‌కు వెళ్లా' అని గౌతమి చెప్పినట్లు సమాచారం. దీంతోపాటు సుమారు 5 పేజీల వరకు ఆమె కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చారు. తొక్కిసలాట ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్ తరపున న్యాయవాదులు కమిషన్ ఎదుట గౌతమిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. మరోవైపు తొక్కిసలాట ఘటనలో కీలకంగా మారిన 16మంది బాధితులను రెండోసారి విచారణకు పిలిచారు. ఓజిలికి చెందిన కృష్ణమ్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా రామసముద్రం మండలానికి చెందిన మరో ఇద్దరిని విచారించారు. పోలీసులు, టీటీడీ నిర్లక్ష్యంగా కారణంగా తాము తీవ్రంగా గాయపడ్డామని వారు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ఇక, మధ్యాహ్నం తర్వాత నలుగురిని మాత్రమే విచారించారు. కాగా, తొక్కిసలాట సమయంలో విధుల్లో ఉన్న అప్పటి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, సస్పెండైన డీఎస్పీ రమణకుమార్, ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డితో పాటు డీఎస్పీ నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు జనవరి 8న పద్మావతి పార్కు వద్ద విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, టీటీడీ విజిలెన్స్ ఉద్యోగులు సుమారు 90మందిని కూడా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విచారణకు పిలిపించారు. సమయం లేకపోవడంతో గురువారం వీరంతా కమిషన్ ఎదుట హాజరు కానున్నారు. కాగా, విచారణ నేపథ్యంలో నాడు విధుల్లో ఉన్న టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, పలువురు డీఎస్పీలు, సీఐలు తమ వెంట లాయర్లను తెచ్చుకున్నారు. కమిషన్ ఎదుట ఎలా వాంగ్మూలం ఇవ్వాలనే దానిపై వారితో చర్చిస్తూ కనిపించారు. తొక్కిసలాట ఘటనపై తిరుపతి కలెక్టరేట్ వేదికగా మరో మూడు రోజుల పాటు విచారణ సాగనుంది.

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- తీర్మానంపై 16 మంది కౌన్సిలర్ల సంతకాలు
- వేడెక్కుతున్న వెంకటగిరి మున్సిపల్ రాజకీయం
- సొంతపార్టీలో కుంపటిని ఆర్పేపనిలో నేదురుమల్లి



అవిశ్వాస నోటీసును కలెక్టర్‌కు అందజేస్తున్న కౌన్సిలర్లు

వెంకటగిరి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి వైసీపీలో 'అవిశ్వాస' కుంపటి రాజుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి దక్కించుకునేందుకు కౌన్సిలర్ దొంతు శారద శరవేగంగా పావులు కదుపుతున్నారు. ప్రస్తుత చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై అవిశ్వాసానికి సొంత పార్టీలోని కౌన్సిలర్ల మద్దతు కూడగట్టారు. 16 మంది కౌన్సిలర్లతో అవిశ్వాస తీర్మాన నోటీసులపై సంతకాలు చేయించి బుధవారం కలెక్టరు వెంకటేశ్వర్‌కు అందజేశారు. అవిశ్వాసం ప్రవేశ పెట్టడానికి సరిపడా కౌన్సిలర్ల మద్దతు కూడగట్టిన శారద.. ఆ తర్వాత సంపూర్ణ మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు. దీనికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కూటమి నేతల మద్దతు ఆమెకు ఉన్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ నుంచి కౌన్సిలరుగా గెలిచిన దొంతు శారద అప్పట్లో చైర్‌పర్సన్ పదవి ఆశించారు. అప్పటి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి 24వ వార్డు కౌన్సిల్ నక్కా భానుప్రియను ఎంపిక చేశారు. గడిచిన నాలుగేళ్లలో మున్సిపాలిటీలో పెద్దగా పనులు జరగకపోవడంతో సొంత పార్టీ కౌన్సిలర్లే చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇక, చైర్స్‌పర్సన్ బావ నక్కా వెంకటేశ్వరావు పెత్తనంపై పలు సమావేశాల్లో సొంత పార్టీ కౌన్సిలర్లు నిలదీశారు. అయినా, అతడిలో మార్పులేకపోవడం.. చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై అసమ్మతి పెరిగేలా చేసింది. దీన్ని తమకు అనుకూలంగా శారద మార్చుకున్నారు. మరోవైపు ఈమెకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ పరోక్ష సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. తిరుమలకు సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో వెంకటగిరి మున్సిపల్ రాజకీయాల గురించి టీడీపీ నేతలు చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇక, సొంత పార్టీలో రేగిన 'అవిశ్వాస చిచ్చు'ను ఆర్పే పనిలో నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం. దీనికోసం ఆయన గురువారం వెంకటగిరి వస్తున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి.

మున్సిపాలిటీలో బలాబలాలిలా

వెంకటగిరి మున్సిపాల్టీలోని మొత్తం 25 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లే ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 5, 4, 7 వార్డుల కౌన్సిలర్లు టీడీపీ గూటికి చేరారు. మిగిలి 22 మంది కౌన్సిలర్లు వైసీపీలోనే కొనసాగుతూ వచ్చారు. ఈ నెల 17వ తేదికి పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి కావడంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే అవకాశం ఏర్పడింది. దీంతో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి 16 మంది కౌన్సిలర్ల సంతకాలతో అవిశ్వాసంపై నోటీసులిచ్చారు. దీనిపై ఆయన సమావేశ తేదీని ఖరారు చేయాల్సి ఉంది.



శ్రీవారి సేవలో ప్రభుదేవా

సినీ దర్శకుడు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సతీమణి హిమాని సింగ్, కుమార్తెతో కలిసి వీఐపీ బ్రేక్‌లో స్వామిసేవలో పాల్గొన్నారు. ఆలయం వెలుపల ఆయన్ను చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

- పారా మిలటరీ బలగాలతో కూంబింగ్
- పోలీసుల అదుపులో 40 మంది అనుమానితులు

తిరుపతి(నేరవిభాగం)/తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేణిగుంట విమానాశ్రయంలో పారా మిలటరీ బలగాలు మోహరించాయి. తిరుమల, తిరుపతిలో అడుగడుగునా తనిఖీలు చేస్తున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమలకు వెళ్లే అన్ని మార్గాల్లోని కల్వర్టులు, బ్రిడ్జిలు, రోడ్లకు ఇరువైపులా బాంబు స్క్వాడ్లు తనిఖీలు చేస్తుండగా.. రోడ్డు డిగ్గింగ్ పార్టీలు అనుమానిత ప్రాంతాల్లో రోడ్లు తవ్వి పరిశీలిస్తున్నాయి. ఇక, గరుడ సర్కిల్ నుంచి తిరుమల ఘాట్ రోడ్లలో రిజర్వు బలగాలు తనిఖీలు చేస్తున్నాయి. ఎస్టీఎఫ్ బలగాలు శేషాచలం అడవుల్లో కూంబింగ్ చేపట్టాయి. తిరుపతి, తిరుమలలో తనిఖీలు చేసిన పోలీసులు ఇప్పటికే దాదాపు 40 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అనంతపురం డీఐజీ షిమోషీ నేతృత్వంలో ఇద్దరు ఎస్పీల పర్యవేక్షణలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 25 మంది డీఎస్పీలు, 56 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లతో పాటు మరో 200 మంది పోలీసులు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, హోంగార్డులు, మహిళా పోలీసులు, ఎస్టీఎఫ్ బలగాలు సీఎం బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. మరోవైపు విమానాశ్రయం నుంచి తిరుమల వరకు భద్రతా సిబ్బంది సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. సీఎం బస చేసే పద్మావతి అతిథిగృహం, కాన్వాయ్ ప్రయాణించే మార్గాలు, శ్రీవారి ఆలయం, అన్నప్రసాద భవనాల్లో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తిరుమల పోలీసు, విజిలెన్స్ అధికారులతో కలిసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శ్రీవారి ఆలయం, పరిసర ప్రాంతాలు, ఘాట్‌రోడ్లలో తనిఖీలు నిర్వహించి భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నప్రసాద భవనంలో తనిఖీలు నిర్వహించారు. కాగా, సీఎంతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి తిరుమలకు రానున్నారు.



శ్రీవారి ఆలయం ముందు భద్రతాంశాలపై చర్చిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అధికారులు

ఆర్టీసీ బస్సెక్కి.. హంగామా చేసి!

- కండక్టర్ విధులకు ఆటంకం
- తిరుపతి మేయర్ సహా 25 మందిపై కేసు



ఆర్టీసీ బస్సులో వైసీపీ నేతలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సెక్కారు. మహిళలకు ఉచిత ప్రయాణమని చెప్పారంటూ టికెట్ తీసుకునేది లేదని వాదనకు దిగారు. కండక్టర్ విధులకు ఆటంకం కలిగించిన ఘటనలో తిరుపతి మేయర్ శిరీష సహా 25 మంది వైసీపీ నేతలపై బుధవారం కేసులు నమోదయ్యాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ నెరవేర్చాలంటూ తిరుపతిలో వైసీపీ నాయకులు నిరసన తెలిపారు. మేయర్ శిరీష, భూమన అభినయ్, టౌన్‌బ్యాంకు చైర్మన్ జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ సహదేవ యాదవ్, నగర పార్టీ అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు గీత యాదవ్ తదితరులు ఆర్టీసీ బస్టాండు వద్ద పీలేరు వెళ్లే పల్లె వెలుగు బస్సు ఎక్కారు. బస్సు లీలామహల్ వద్దకు రాగానే కండక్టర్ టికెట్ అడిగారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని హామీ ఇచ్చారంటూ టికెట్ తీసుకునేది లేదన్నారు. టికెట్ ఇవ్వకుంటే దిగేయండని చెప్పారు. దీనిపై కాసేపు కండక్టర్ దామోదర్‌కు, వైసీపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కండక్టర్ టికెట్లు కొట్టకుండా అడ్డుకోవడంతో డ్రైవర్ బస్సును ఆపేశారు. పీలేరు డిపో కండక్టర్ దామోదర్ ఫిర్యాదు మేరకు 25 మందిపై తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కొందరిని ఎస్వీయూ స్టేషన్‌కు.. మరికొందరిని ఈస్ట్ స్టేషన్‌కు తరలించారు. 41 నోటీసులు అందచేసి సొంత పూచీకత్తులపై విడుదల చేసినట్లు ఈస్ట్ సీఐ రామకృష్ణ చెప్పారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించినా.. ముందస్తు అనుమతులు లేకుండా ధర్నాలు, ఆందోళనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటన వచ్చే వరకు డ్రైవర్లు, కండక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని డీపీటీవో నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం ఆదేశించారు. బుధవారం వీరు 11 డిపోల మేనేజర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రయాణికుల కదలికలపై దృష్టిపెట్టాలని, వారివద్ద జెండాలు, బ్యానర్లు వంటివి ఉన్నాయా గమనించాలని, అనుమానం కలిగితే పై అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మార్గమధ్యలో ఎవరైనా ఆందోళన చేస్తే బస్సును నేరుగా సమీప పోలీస్‌స్టేషన్‌కు తరలించాలని సూచించారు.

నేడు సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ నాలుగో స్నాతకోత్సవం గురువారం జరగనుంది. మహతిలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భారత మాజీ ఎన్నికల ప్రధానాధికారి, పద్మవిభూషణ్ గ్రహీత ఎన్.గోపాలస్వామి హాజరు కానున్నారు. పలువురికి బంగారు పతకాలు, స్నాతకోత్తర డిగ్రీలు, బిరుదులు, పట్టాలు ప్రదానం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవంలో వర్సిటీ మాజీ ఛాన్సలర్ డాక్టర్ వీఆర్ పంచముఖి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మొత్తం 564 మంది విద్యార్థులు స్నాతకోత్సవ పట్టాలు స్వీకరించనున్నారు. స్నాతకోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. కాలానుగుణంగా యూనివర్సిటీ అనేక మార్పులు చేర్పులు చేసిందన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (గురువారం సాయంత్రం)
సహర్: 4:57 (శుక్రవారం ఉదయం)

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

డిపో మేనేజర్ తన వైఖరిని మార్చుకోవాలి



డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని మార్చుకోవాలని ఎన్ఎంయూ నాయకులు అన్నారు. బుధవారం డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండోరోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గూడూరు నుంచి తిరుమల, బెంగళూరుకు బస్సులను నడపాలని కోరుతున్నా, ఇందుకు సంబంధించి నోట్‌ఫైల్‌ను ఇప్పటి వరకు డీఎం సిద్ధం చేయలేదన్నారు. అంతేకాకుండా ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కండక్టర్లు, డ్రైవర్ల డ్యూటీచార్ట్‌లను వెంటనే అమలు చేయాలని కోరారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేవరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, అహ్మద్, వెంకయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణ, హుస్సేన్, పోలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు తాంబూలం అందజేత



శ్రీనివాసులురెడ్డికి తాంబూలం అందజేస్తున్న ఈవో రవివర్మ

నాయుడుపేట టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతరకు తాంబూలాన్ని అందజేశారు. బుధవారం ఉదయం దేవదాయశాఖ ఈవో రవివర్మ పట్టణ పరిధిలోని విన్నమాల గ్రామానికి వెళ్లి పెదకాపు శ్రీనివాసులురెడ్డికి తాంబూలాన్ని అందజేశారు. జాతర నిర్వహణకు పెద్దలు, గ్రామస్తులు సహకరించాలని ఈవో కోరారు. మార్చి 25వ తేదీ రాత్రి మొదటి చాటింపు, మే 4వ తేదీ ఘట్టం, మే 6వ తేదీ రాత్రి అమ్మవారి నిలుపు, మే 7వ తేదీ జాతర నిర్వహిస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లబోతుల రామారావు, నానాబాల సుబ్బారావు, కుబేరు మణి, గుంటూరు లక్ష్మయ్య, ఆర్ఎస్ గిరి, రవీంద్ర, మహేష్‌రెడ్డి, చిట్టి, పూజారి సురేష్, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, బిరదవాడ నారాయణ, మల్లాం రవి, తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

గూడూరు అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. బుధవారం స్థానిక డిపో వద్ద పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అనేక సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన బెనిఫిట్స్ పూర్తిస్థాయిలో అందడంలేదన్నారు. కార్యక్రమంలో శేషయ్య, బీవీరమణయ్య, హరినాథ్, రత్నయ్య, రాజారామ్, జయచంద్ర, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం మాధవీలక్ష్మి

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ కబడ్డీ పోటీలకు స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు మాధవీలక్ష్మి తెలిపారు. బుధవారం పాఠశాలలో కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులో మాండలేస్ కంపెనీ సహకారంతో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన దీపిక, కౌసల్య, హర్షియా ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 21నుంచి 23వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని బద్దీ యూనివర్సిటీలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఫౌండేషన్ ప్రతినిధి లత తదితరులు పాల్గొన్నారు.

23న భగత్ సింగ్ వర్ధంతి సభ

వెంకటగిరి టౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురులను ఉరితీసి 93 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 23న పట్టణంలో ర్యాలీ, సభ నిర్వహిస్తున్నామని పీడీఎస్‌వో పట్టణ నాయకుడు సీహెచ్ పవన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు లీలామోహన్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి అగ్రి వర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల రైతులకు నికరాదాయం లభించేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఈ నెల 27, 28, 29 తేదీల్లో గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన, సదస్సు జరుగుతుందని వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి తెలిపారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాలకు ఉపయోగపడే ఈ సదస్సులో సాంకేతిక పరికరాల ప్రదర్శనకు 300 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కాగా, పత్తి సాగు, పరిశోధనలు, భవిష్యత్ వ్యూహాలను చర్చించేందుకు ఈ నెల 21 నుంచి 23 వరకు లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ స్థాయి సమావేశం జరుగుతుందని లాం ఫాం అసోసియేట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

ఎరువుల అక్రమ రవాణాపై నిఘా: అగ్రి డైరెక్టర్

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రసాయన ఎరువులు పక్కదారి పట్టకుండా నిరంతర నిఘా ఉంచాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ అవసరాల కోసం ఎరువులను బఫర్ స్టాక్‌ను 2లక్షల టన్నులకు పెంచనున్నట్టు చెప్పారు. ఎరువుల రవాణాలో ఖర్చులు అధికంగా ఉంటున్న విశాఖపట్నం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాలకు మూడు రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు పంపారన్నారు. ఎరువులు సమృద్ధిగా వస్తున్నా.. కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయం, అక్రమ తయారీ, రవాణాను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమయం మార్పు

గూడూరు అర్బన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ సమయాన్ని మార్చినట్లు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా బుధవారం తెలిపారు. ఎండ తీవ్రత వల్ల సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

పంచాంగం ఆవిష్కరణ

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శిరోమణిశర్మ రాసిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని బుధవారం స్థానిక బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనిమెళ్ల శివకుమార్, శ్రీనివాసరావు, విద్యాలలిత, శ్రీనివాస్, నరసింహారావు, రామ్మూర్తి, సుబ్బారావు, ప్రకాశం పాల్గొన్నారు.



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణసేవాసంఘ నాయకులు





కుదిరి - అట్టకానితిప్ప మధ్య రివిట్‌మెంట్ పనులు - అట్టకానితిప్ప అవతలి వైపు కొత్తగా నిర్మించిన రివిట్‌మెంట్

శ్రీహరికోట రోడ్డుకు రివిట్‌మెంట్

వరదల్లో కోతకు గురికాకుండా షార్ చర్యలు

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డుకు కుదిరి రెండో బ్రిడ్జి నుంచి షార్ ముఖద్వారం వరకు ఇరువైపులా రివిట్‌మెంట్ నిర్మిస్తున్నారు. కుదిరి నుంచి శ్రీహరికోటకు ముఖద్వారం వరకు పులికాట్ సరస్సు మధ్యలో రోడ్డు ఉంది. 2023 మిచౌంగ్, 2014లో ఫెంగల్ తుఫాన్‌ల ప్రభావంతో వచ్చిన వరదల తాకిడికి శ్రీహరికోట రోడ్డు ఇరువైపులా దెబ్బతింది. వరదలతో పులికాట్‌కు భారీగా నీరుచేరి రోడ్డు మీద పొర్లాయి. దీంతో రోడ్డు అంచు కోతకు గురైంది. అప్పట్లో షార్ యాజమాన్యం స్పందించి రోడ్డు కోతకు గురికాకుండా ఇసుక బస్తాలు రక్షణగా వేశారు. ప్రస్తుతం వేసవి కావడంతో కుదిరి రెండో బ్రిడ్జి వద్ద నుంచి శ్రీహరికోట ముఖద్వారం వరకు రోడ్డుకు ఇరువైపులా రూ.50 లక్షలతో రివిట్‌మెంట్ నిర్మిస్తున్నారు. వరదల సమయాల్లో నీటి ఉధృత ఎక్కువైనా తట్టుకొనేలా రోడ్డుకు సమాంతరంగా ఎర్రగులక రాళ్ల పేర్చి సిమెంట్ వేస్తున్నారు. ప్రస్తుతం అట్టకానితిప్ప అవతలి వైపు శ్రీహరికోట ఎంట్రన్స్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర రెండువైపులా రివిట్‌మెంట్‌ను పూర్తి చేశారు. కుదిరి నుంచి అట్టకానితిప్ప వరకు రివిట్‌మెంట్ పనులను వేగంగా జరుగుతున్నాయి.

పట్టణంలో ప్రముఖుల విగ్రహాల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక

నాయుడుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయించింది. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో చైర్ పర్సన్ కటకం దీపిక ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జమా ఖర్చుల వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ ముగింపు నిల్వ రూ.4,67,71,633 ఉండగా, సాధారణ, మూలధన జమ రూ.21,64,86,000గా పేర్కొన్నారు. మొత్తం ఆదాయం రూ.26,32,57,693 కాగా మూలధన ఖర్చులు రూ.21,26,51,000, ముగింపు నిల్వ రూ.5,06,06,693 గా చూపారు. అనంతరం చైర్ పర్సన్ కటకం దీపిక మాట్లాడుతూ పట్టణంలో మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగజ్జీవన్‌రామ్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మాజీ మంత్రి పసల పెంచలయ్య తదితరుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించగా కౌన్సిలర్లందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపాలిటీకి సంబంధించి పోలేరమ్మ గుడి వద్ద, సీఎస్‌తేజ సెంటర్ వద్ద, ఆర్టీసీ ప్రాంతం వద్ద మున్సిపాలిటీకి విలువైన వాణిజ్య స్థలాలు ఉన్నాయని, ఆయా స్థలాల్లో లబ్ధిదారుల వాటాతో దుకాణాలు ఏర్పాటు చేస్తే ఆదాయం చేకూరుతుందన్నారు. అలాగే ఎస్‌జేఆర్ కాంప్లెక్స్ మిద్దెపైన దుకాణాలకు వేలం నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, డీఈ శ్రీనివాసులు, ఏఈ చంద్ర, లక్ష్మి, రమేష్, గాయత్రి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి - కురుగొండ రోడ్డును బాగు చేయండి



అధ్వానంగా ఉన్న ఓజిలి - కురుగొండ రహదారి

ఓజిలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఓజిలి - కురుగొండ రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాలతో ఇసుక, గ్రావెల్, మట్టి తరలిస్తుండడంతో బాగా దెబ్బతింది. ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా రోజుల వ్యవధిలోనే మళ్లీ యథాతథస్థితికి చేరుకుంటోంది. ఏడు కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డులో గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. గోతులను తప్పించే ప్రయత్నంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవతున్నాయి. ప్రధానంగా ఓజిలికి సమీపంలోని పొలాల వద్ద, బత్తలాపురం, మానమాల, కురుగొండ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఓజిలి - కురుగొండ రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గోతులు



చెంగాళమ్మ మాను సమీపంలో రహదారిపై గుంత

చిట్టమూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గోతులు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. యాకసిరి చెంగాళమ్మ మాను సమీపంలోని తెలుగుగంగ కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. అదేవిధంగా కొత్తగుంట కట్టెలదొడ్డి వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులకు గుంతలు కనిపించక పోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి నాయుడుపేట - మల్లాం ప్రధాన రహదారిపై గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉంది.

పరీక్షా కేంద్రాల్లో డీఈవో తనిఖీలు



ఎంఈవో కార్యాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఈవో కుమార్

కోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కోటలోని బీసీ బాలుర, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం డీఈవో కుమార్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. బీసీ గురుకులంలో 6, 7 తరగతుల విద్యార్థులు బయట తిరుగుతుండటంతో వారిని గదుల్లోకి పంపారు. పరీక్షల సమయంలో ఇతర విద్యార్థులను ఎలా బయటకు పంపుతారని ప్రిన్సిపాల్, సిబ్బందిని ప్రశ్నించారు. పదో తరగతి పరీక్షలు పక్కందీగా నిర్వహిస్తున్నామని, ఎక్కడైన తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయాన్ని డీఈవో తనిఖీ చేశారు. కార్యాలయంలో వసతులు లేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.

పరీక్షా కేంద్రం వద్ద మురుగు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం గేటు వద్ద మురుగునీటి నిల్వను మున్సిపాలిటీ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. ఈ నెల 18న మంగళవారం ఆంధ్రజ్యోతిలో పరీక్షా కేంద్రం వద్ద మురుగు.. దుర్గంధంతో విద్యార్థుల ఇక్కట్లు శీర్షికన వార్త రావడంతో మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. బుధవారం మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య చొరవ తీసుకొని పారిశుధ్య కార్మికుల సాయంతో కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారాలను తొలగించారు. సమీపంలోని కాలువలో పూడికతీశారు. మురుగునీటిని పూర్తిగా బటయకు పంపి బ్లీచింగ్ వేశారు. అదేవిధంగా పట్టణంలో పలుచోట్ల కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలిగించి మురుగు నిల్వలేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

పారదర్శకంగా రీసర్వే



అల్లంపాడులో భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు జయజయరావు

కోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడు పంచాయతీలో భూముల రీసర్వే పారదర్శకంగా చేపట్టాలని, ఎక్కడైన లోపాలు జరిగితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దారు జయజయరావు హెచ్చరించారు. బుధవారం రీసర్వే జరుగుతున్న తీరును, భూములకు సంబంధించిన రికార్డులను తహసీల్దారు పరిశీలించారు. ప్రభుత్వ పట్టా భూములపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వో కృష్ణయ్య, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోండి

పెళ్లకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా ఉన్న 164 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులను హౌసింగ్ ఏఈ వెంకయ్య కోరారు. బుధవారం చిల్లకూరు సచివాలయంలో ఆయన మాట్లాడుతూ పీఎంఏవై, పీఎం జన్‌మన్ పథకంలో మంజూరై నిర్మాణం పూర్తి కాకుండా ఆగిపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్లకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా 2029 నాటికి అందరికీ ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో యూనిట్‌కు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శాంతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.


చోరీ కేసులో బంగారు ఆభరణాలు స్వాధీనం

నాయుడుపేట టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో 2.4 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణంలోని అగ్రహారపేటలో నివాసం ఉంటున్న మాధవి తన ఇంట్లో నగలు చోరీకి గురైనట్లు ఫిబ్రవరిలో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానికంగా ఓ మహిళను విచారించగా నగలు చోరీ చేసి కుదవపెట్టినట్లు తేలింది. బుధవారం నగలు స్వాధీనం చేసుకొని నిందితురాలిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

విషపురుగు కాటుతో బాలుడి మృతి

తడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విషపురుగు కాటుతో బాలుడు మృతి చెందాడు. మండల పరిధిలోని వేనాడు మూల గ్రామానికి చెందిన మల్లు తేజేష్(7) ఆదివారం రాత్రి ఇంటి వద్ద ఆరుబయట నిద్రిస్తుండగా విషపురుగు కాటేసింది. వెంటనే తల్లిదండ్రులు ఆ బాలుడిని సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని చైల్డ్ ట్రస్టు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అళఘునాథస్వామికి లక్షతులసీ పూజ



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అళఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి, అమ్మవార్లకు సామూహిక లక్షతులసీపూజ చేశారు. భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

లోకోస్ యాప్‌పై వీవోలకు శిక్షణ



మహిళలకు లోకోస్ యాప్‌పై శిక్షణ ఇస్తున్న ఏపీవో గున్నయ్య

చిట్టమూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల పనితీరును పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్ వినియోగంపై చిట్టమూరు స్త్రీశక్తి భవనంలో రెండు రోజుల పాటు వీవోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీవో గున్నయ్య మాట్లాడుతూ లోకోస్ యాప్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల పొదుపు, రుణాలు, ఇతర ఆర్థిక పథకాల ప్రయోజనాలు సులభతరం అవుతాయన్నారు. పొదుపు సంఘాలకు సంబంధించిన నిర్దిష్టమైన వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని వీవోలకు వివరించారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

సూళ్లూరుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం వేముగుంటపాలెం గ్రామానికి చెందిన శ్రీరాంసుబ్బయ్యకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష 14 వేలు చెక్కును టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి బుధవారం అందజేశారు. నాయకులు వేనాటి జనార్దనరెడ్డి, కేవీరెడ్డి, బాబురెడ్డి, కామిరెడ్డి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న వేనాటి సతీష్ రెడ్డి, జనార్దనరెడ్డి, అశోక్ రెడ్డి, కేవీ రెడ్డి తదితరులు

ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే చర్యలు



దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించినా, వినియోగించినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద దుకాణ దారులకు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను నిషేధించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే పలు ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలను తనిఖీ చేశారు. రసాయన రంగులు కలిపిన మాంసం, కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసకుంటామని హెచ్చరించారు.

చర్లపల్లి - కన్యాకుమారి మధ్య 26 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి-కన్యాకుమారి మధ్య 26 ప్రత్యేక రైళ్ల ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఏప్రిల్ 2న చర్లపల్లిలో ఈ ప్రత్యేక రైలు(07230) రాత్రి 9.50 గంటలకు బయలుదేరి నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుత్తణి, కాట్పాడి, తిరువణ్ణామలై, విల్లుపురం, తిరుప్పాదిరి పులియూర్, చిదంబరం, మైలాడుదురై, కుంభకోణం, తిరువారూర్, తిరుచ్చి, దిండిగల్లు, కొడైకెనాల్ రోడ్డు, మధురై, విరుదునగర్, సతూర్, కోవిల్‌పట్టి, తిరునల్వేలి, వల్లియూర్, నాగర్‌కోయిల్ మీదుగా కన్యాకుమారిలకు రెండవ రోజు రాత్రి 2.30 గంటలకు చేరుకుంటుంది. కన్యాకుమారిలో ఈ ప్రత్యేక రైలు(07229) ఏప్రిల్ 4న ఉదయం 5.15 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 11.40 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుందని వెల్లడించారు. ఈ ప్రత్యేక రైళ్లు జూన్ 27వ తేదీ వరకు చర్లపల్లిలో ప్రతి బుధవారం, కన్యాకుమారిలో ప్రతి శుక్రవారం బయలుదేరి రాకపోకలు సాగిస్తాయని రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు.